భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 14 సంచిక: 22 | వరంగల్, 23-6-2026, మంగళవారం | పేజీలు: 8 | వెల: 1.00


## ప్రభుత్వ నిధులు.. పాత టైల్స్‌తో పనులా..?

రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల టాయిలెట్ల మరమ్మతు పనుల్లో నాసిరకం, పాత టైల్స్‌ను వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో చేపడుతున్న పనుల నాణ్యతపై విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ.. 20 నిమిషాలపాటు చర్చ



దిల్లీ: హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్నారు. వాయుసేన టెర్మినల్‌తోపాటు కార్గో, ఎమ్ఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. హ్యాంగర్స్ ఏర్పాటుకు ఆదిలాబాద్ విమానాశ్రయం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో ప్రాజెక్టు త్వరగా మంజూరు చేయాలని కోరారు.

# ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ 100 సీట్లు గెలవడం ఖాయం: మహేశ్‌కుమార్ గౌడ్



వరంగల్: ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎన్ఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.



# తెలంగాణలో పలు జిల్లాలకు భారీ వర్షసూచన

హైదరాబాద్: తెలంగాణలోని పలు జిల్లాల్లో ఐదు రోజుల పాటు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. మంగళవారం జగిత్యాల, సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు పడే వీలుందని పేర్కొంది. నైరుతి రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది.

ఏపీలో రాగల మూడు గంటల్లో..

మరో వైపు ఏపీలో రాగల మూడు గంటల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామన్నారు. పలు జిల్లాల్లో ఈదురు గాలులతో వర్షం, పిడుగులు పడే అవకాశముందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# అమెరికాలో మరో తెలుగు యువకుడు మృతి



బిజినేపల్లి: అమెరికాలో మరో తెలుగు యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణకు చెందిన సాయి అరుణ్ రెడ్డి (26) ఫ్లోరిడాలో మృతి చెందడం విషాదం నింపింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న యువకుడి మరణ వార్తతో బిజినేపల్లి మండలంలోని అతడి స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

వివరాల్లోకి వెళ్తే.. బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన సరళ, వెంకట్ రెడ్డి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. 2022లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో ఫ్లోరిడాకు వెళ్లిన అరుణ్.. అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తాను నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పద రీతిలో విగతజీవిగా పడి ఉండటంతో.. తోటి స్నేహితులు అప్రమత్తమై కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అరుణ్ గత కొంతకాలంగా థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే, అతడి మృతికి గల పూర్తి కారణాలు మాత్రం ఇంకా తెలియలేదు. సోమవారం అమెరికాలో అతడి భౌతికకాయానికి పోస్టుమార్టం పూర్తవుతుందని, అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# కోచింగ్ సెంటర్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 15కి పెరిగిన మృతులు



ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలోని ఓ కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది ఈ ఘటనలో మృతుల సంఖ్య 15కు చేరింది. మరికొందరు గాయాలతో చికిత్సపొందుతున్నారు. ఈ ఘటనలో కొందరు తమ ప్రాణాలను కాపాడుకొనేందుకు భవనం పైఅంతుస్తుల నుంచి కిందికి దూకారు. ఈ ప్రమాద దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

లఖ్‌నవూలోని అలీగంజ్ ప్రాంతంలోని మూడంతస్తుల భవనం పైభాగంలో తొలుత మంటలు చెలరేగాయి. తర్వాత పైఅంతస్తులో ఉన్న కోచింగ్ సెంటర్‌కు ఎగబాకాయి. భవనమంతా మంటల్లో చిక్కుకుపోవడంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. మృతుల్లో పలువురు విద్యార్థులతో పాటు మరికొందరు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

మంటల్లో చిక్కుకున్న పలువురు తమ ప్రాణాలు కాపాడుకోవడానికి పైనుంచి దూకిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఒక వ్యక్తి పగిలిన కిటికీ నుంచి బయటకు వచ్చే క్రమంలో కిందికి పడిపోయాడు. అది గమనించి స్థానికులు వెంటనే అతడిని కాపాడారు. గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు. కొందరు అక్కడి తీగలను పట్టుకొని వేలాడుతూ బయటపడే ప్రయత్నం చేశారు. అగ్ని ప్రమాదం జరిగిన 30 నిమిషాల తర్వాత ఫైర్ ఇంజిన్లు వచ్చాయని స్థానికులు ఆరోపించారు. అందువల్లే, మంటలు మరింత భారీగా వ్యాపించాయని చెబుతున్నారు. 'లఖ్‌నవూలో అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల.. క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున నష్టపరిహారం అందిస్తాం' -ప్రధాని నరేంద్ర మోదీ'లఖ్‌నవూ ప్రమాదం దిగ్భ్రాంతికి గురి చేసింది. ఘటనా స్థలాన్ని వెంటనే సందర్శించి.. నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించా. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు వీలుగా అలీగఢ్‌లో పర్యటనను కుదించుకుని వెంటనే లఖ్‌నవూకు బయలుదేరుతున్నాను' -యూపీ సీఎం యోగి

# ఆపరేషన్ టైగర్: శిందే క్యాంప్‌లోకి ఆరుగురు ఎంపీలు



ముంబయి: మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. శివసేన (యూబీటీ)కు చెందిన ఆరుగురు ఎంపీలు శిందే నేతృత్వంలోని శివసేనలో చేరారు. దీంతో గడిచిన కొన్ని రోజులుగా శివసేన (యూబీటీ)లో చీలికపై జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. 'ఆరు పులులు (ఎంపీలనుద్దేశించి) ఇప్పుడు అసలైన శివసేన ఫ్యామిలీలోకి వచ్చాయి. వారికి స్వాగతం. ఆపరేషన్ టైగర్ విజయవంతమైంది' అని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే ప్రకటించారు.

శిందే క్యాంప్‌లో చేరిన ఎంపీల్లో ఓం రాజే నింబాల్కర్, సంజయ్ దిన పాటిల్, సంజయ్ జాదవ్, సంజయ్ దేశ్‌ముఖ్, నగేష్ పాటిల్ అష్టికర్, బౌసాహెబ్ వక్చౌరే ఉన్నారు. మొత్తం 9 మంది ఎంపీల్లో ఆరుగురు శిందే క్యాంప్‌లో చేరడంతో పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల క్రితం 2022 జూన్ 22న 40 మంది ఎమ్మెల్యేలు తమతో వచ్చారన్న శిందే.. ఇప్పుడు ఏకంగా 'సిక్స్' కొట్టామని పేర్కొన్నారు. శివసేన రెండో విడత విస్తరణ ప్రణాళికగా ఈ చేరికను అభివర్ణించారు.

# విరాళాల వివాదం

అయోధ్య వేర్వేరు సందర్భాల్లో దేశ విదేశాల దృష్టిని ఆకర్షించింది. అయితే ఈసారి కారణం ఆలయ ఉద్యమం, దాని వైభవం లేదా భక్తుల రద్దీ కాదు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ పనితీరు, ఆలయ విరాళాల చుట్టూ తలెత్తుతున్న తీవ్ర అవకతవకల ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ రామ్ జన్మభూమి ట్రస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. ట్రస్ట్ కళ్లముందే ఆలయ విరాళాలు, కానుకల లెక్కల్లో పెద్ద ఎత్తున తేడాలు జరిగాయని, రామాలయ కానుకల నుంచి కోట్ల రూపాయలు మాయమయ్యాయని ఆయన ఆరోపిస్తున్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలతో పాటు స్థానిక మాజీ కరసేవకుడు సంతోష్ దూబే, బీజేపీ నాయకుడు డాక్టర్ రజనీశ్ సింగ్ తదితరులు ఈ అవకతవకలను ప్రస్తావిస్తూ జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రస్తుతం ఈ ఆరోపణలపై విచారణ సాగిస్తోంది. అయితే, ఈలోగా అయోధ్య స్థానికులు, ఇక్కడికి వచ్చే భక్తులలో తీవ్ర నిరాశ, ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తున్నాయి. కోట్లమంది నమ్మకం, త్యాగాల ఫలితంగా నిర్మితమైన ఆలయం చుట్టూ ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అయోధ్యకు మచ్చ తెచ్చే అంశంగా భావిస్తే, మరికొందరు పారదర్శకత కోసం విచారణ అవసరమని అంటున్నారు. ఈ వివాదాలన్నింటికీ కేంద్ర బిందువుగా మారిన శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో జనరల్ సెక్రటరీ, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడైన చంపత్ రాయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. 2020 ఫిబ్రవరిలో అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత, న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. 15 మంది సభ్యులతో కూడిన ఈ ట్రస్ట్‌లో అధ్యక్షుడిగా మహంత్ నృత్య గోపాల్ దాస్, కోశాధికారిగా స్వామి గోవింద్ దేవ్ గిరి, సీనియర్ న్యాయవాది కె. పరాశరన్, డాక్టర్ అనిల్ మిశ్రా, కామేశ్వర్ చౌపాల్, మహంత్ దినేంద్ర దాస్ సహా పలువురు మత, సామాజిక ప్రతినిధులు ఉన్నారు. ట్రస్ట్ జనరల్ సెక్రటరీగా ఉన్న చంపత్ రాయ్.. దీని రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించే అత్యంత కీలకమైన అధికారి. ఆలయ నిర్మాణ ప్రాజెక్టు, విరాళాలు–కానుకల నిర్వహణ, అధికారిక సంప్రదింపుల బాధ్యత ఆయనపైనే ఉండటంతో మీడియా ప్రతినిధులు ఆయన సమాధానం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఒక వీడియోలో చంపత్ రాయ్ ఈ ఆరోపణలను ఖండించారు. "శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రం తన వివిధ పనులకు సంబంధించి సమయానుసారం ఆడిట్ నిర్వహిస్తూనే ఉంటుంది. హుండీ కౌంటింగ్ రూమ్ ఆడిటింగ్‌ను రామాలయ తీర్థ క్షేత్ర ట్రస్టీలు, కార్యకర్తలు, స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు కలిసి చేస్తారు. ఈ ప్రక్రియ చాలా రోజుల పాటు సాగుతుంది. ప్రస్తుతం ఆ పనే జరుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి తప్పులూ మా దృష్టికి రాలేదు'' అన్నారు. చంపత్ రాయ్‌ను సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఎలాంటి స్పందనా రాలేదు. ఆయన సాధారణంగా అయోధ్యలోని కరసేవక్ పురంలో నివసిస్తుంటారు. కానీ, మేం అక్కడికి వెళ్లినప్పుడు.. గత ఏడెనిమిది రోజులుగా, అంటే సిట్ దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి ఆయన ఆలయ ప్రాంగణంలోనే ఉంటున్నారని విశ్వహిందూ పరిషత్ సభ్యుడొకరు మాకు తెలిపారు. అయోధ్యలోని స్థానికులు, వ్యాపారులు, సంత్–మహంత్‌లు లేదా రామాలయంతో సంబంధం ఉన్న సామాజిక, మతపరమైన సంస్థల ప్రతినిధులు.. ఇలా వరితో మాట్లాడినా, వారిలో చాలామంది తాజా వివాదం విని తామేమీ ఆశ్చర్యపోలేదని చెప్పారు. గత కొన్నేళ్లుగా ఆలయం, ట్రస్ట్‌కు సంబంధించి రకరకాల వార్తలు, చర్చలు ఎప్పటికప్పుడు బయటకు వస్తూనే ఉన్నాయని, అందుకే ఈ ప్రశ్నలు తలెత్తడం తమకు కొత్తేమీ కాదని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే చంపత్ రాయ్ పాత్రపై అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అవకతవకల్లో చంపత్ రాయ్ వ్యక్తిగత ప్రమేయం ఉండే అవకాశం లేదని ఆయన మద్దతుదారులు నమ్ముతున్నారు. మరోవైపు, విమర్శకులు మాత్రం ఆయనకు తెలియకుండా ఇంత పెద్ద స్థాయిలో పొరపాట్లు జరగడం అసాధ్యమని వాదిస్తున్నారు. వ్యక్తిగత నిజాయితీ ఎలా ఉన్నా, సంస్థలో జరిగే వాటికి ఆయనే జవాబుదారీ వహించాలని స్పష్టం చేస్తున్నారు. ట్రస్ట్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2021లో అయోధ్యలో కొనుగోలు చేసిన ఒక భూమికి సంబంధించి ట్రస్ట్‌పై ఆరోపణలు వచ్చాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు దీనిపై స్పందిస్తూ.. 'ఒక వ్యక్తి రెండు కోట్ల రూపాయలకు కొన్న భూమిని, ఆ ఒప్పందం జరిగిన కొద్ది నిమిషాలకే ట్రస్ట్ 18.5 కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసింది' అని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్‌తో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ విషయంలో పారదర్శకత ఉండాలని కోరాయి. అయితే, చంపత్ రాయ్, ట్రస్ట్ ఈ ఆరోపణలను తిరస్కరించారు. భూమి కొనుగోళ్లన్నీ పారదర్శకంగా జరిగాయని, చెల్లింపులన్నీ బ్యాంకింగ్ మార్గాల ద్వారానే చేశామని, మార్కెట్ ధర కంటే తక్కువకే ఆ భూమిని ట్రస్ట్ కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలు 'తప్పుదోవ పట్టించేవిగా, 'రాజకీయ దుర్బుద్ధితో కూడినవిగా' ఉన్నాయని చంపత్ రాయ్ కొట్టిపారేశారు. కానీ, రాజకీయ పార్టీలు ఇప్పుడు మరోసారి ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి. 2021లో కూడా ఈ ఆరోపణలపై విచారణ జరిగిందని, అయితే దాని వల్ల ఏమీ తేలలేదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు, అయోధ్య మాజీ ఎమ్మెల్యే పవన్ పాండే అంటున్నారు. ఆ విచారణ ఎలాంటిది, ఎవరు చేశారు, దాని వల్ల తేలిందేమిటి అనే విషయాలపై ఇప్పటివరకు ఎలాంటి కచ్చితమైన సమాచారం లభించలేదు.

# సాయికృష్ణ కేసు..
# మార్కాపురం టు విజయవాడ మధ్యలో ఏం జరిగింది?

ఒంగోలు, జూన్ 22,

విజయవాడ నగరంలో సాయికృష్ణ అదృశ్యం కేసు ఇప్పుడు పెను సంచలనంగా మారింది. అసలు సాయికృష్ణ ఏమయ్యాడు, పోలీసులు కస్టడీలో ఉండగానే ప్రాణాలు కోల్పోయడా? లేదా ఎవరైనా మాయం చేశారా? ఈ ప్రశ్నల చుట్టూ తిరుగుతున్న మిస్టరీని ఛేదించేందుకు ఏసీపీ దైవప్రసాద్ నేతృత్వంలోని స్పెషల్ టీమ్ రంగంలోకి దిగింది. శుక్రవారం ఉదయమే కృష్ణ లంకలోని సాయికృష్ణ నివాసానికి చేరుకున్న అధికారులు, కుటుంబసభ్యుల నుంచి సేకరించిన వివరాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఒకవైపు కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు, మరోవైపు పోలీసుల ఇన్వెస్టిగేషన్ మధ్య ఈ కేసులో అనేక మలుపులు తిరుగుతోంది. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చినప్పటి నుంచి స్టేషన్‌లో జరిగిన పరిణామాల వరకు ప్రతి అంశాన్ని దర్యాప్తు బృందం భూతద్దంతో వెతుకుతోంది. ముఖ్యంగా పోలీసులపైనే ఆరోపణలు వస్తుండటంతో సాక్ష్యాల సేకరణలో అధికారులు అత్యంత గోప్యత పాటిస్తున్నారు. ఏసీబీ దైవప్రసాద్ బృందం నేరుగా సాయికృష్ణ ఇంటికి వెళ్లింది. అక్కడ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి మేనమామ నాగేశ్వరరావు, పిన్ని కనకదుర్గలను సుదీర్ఘంగా విచారించి వారి స్టేట్మెంట్‌లు రికార్డ్ చేశారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు విచరణాధికారులను సైతం విస్మయానికి గురి చేశాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కృష్ణలంక స్టేషన్ లాకప్‌లో ఉంచారని, అక్కడ సీఐ నాగరాజు అతడిని అమానుషంగా చిత్ర వధ చేసి చంపేశారని వారు ఆరోపించారు. కుటుంబ సభ్యుల స్టేట్మెంట్‌ల అనంతరం దర్యాప్తు టీం కృష్ణ లంక స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ కేవలం మాటలతో కాకుండా డిజిటల్ ఎవిడెన్స్ ఆధారంగా నిజానిజాలు తేల్చాలని నిర్ణయించింది. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ కెమెరాల దృశ్యాలు అత్యంత కీలకం కావడంతో అప్పటికప్పుడు ఫోరెన్సిక్ అండ్ సైబర్ అనాలసిస్ టీమ్ పిలపించారు. వీటిన్నింటినీ అధికారులు సీజ్ చేసి, విశ్లేషణ కోసం నేరుగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ రాత్రి స్టేషన్‌లో ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఈ డిజిటల్ ఆధారాలే ఇప్పుడు కీలకంకానున్నాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి విజయవాడకు ఎప్పుడు తీసుకొచ్చారు? ఈ ఆపరేషన్‌లో ఎవరెవరు పాల్గొన్నవారు? అనే కోణంలో విచారణ సాగుతోంది. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ లతాకుమారితోపాటు మరో ఎనిమిది మంది సిబ్బందిని శుక్రవారం దర్యాప్తు టీం విచారించింది. పెండింగ్‌లో ఉన్న ఔఃచి అమలు చేసేందుకే సాయికృష్ణ కోసం నలుగురు సిబ్బందిని మార్కాపురం పంపినట్టు ఏడీసీపీ వివరించినట్టు సమాచారం. అయితే అతడి తీసుకొచ్చిన తర్వాత ఎవరికి అప్పగించారు.?లాకప్‌లో ఉంచిన సమయం ఎంత? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు వారి స్టేట్మెంట్‌లు రికార్డు చేశారు. కేసు తీవ్రతను దృష్ట్యా, ఈ అదృశ్యం వ్యవహారంపై విచారణాధికారిగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌ను నియమించారు. ఆయన శుక్రవారం విజయవాడకు చేరుకుని, తొలుత డీజీపీని కలిసి కేసు పురోగతిని వివరించారు. అనంతరం విజయవాడ సీపీ రాజశేఖరబాబును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరుగా కృష్ణలంక స్టేషన్‌కు వెళ్లిన ఎస్పీ, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని వ్యక్తిగతంగా ప్రశ్నిస్తూ, ఎక్కడైనా గ్యాప్స్ ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రస్తుతానికి దర్యాప్తు బృందం ఎనిమిది మంది కీలక సిబ్బందిని విచారిస్తోంది. ఇందులో టాస్క్‌ఫోర్స్, కృష్ణలంక స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.



చట్టం ఏం చెప్తోంది? శవం లేకపోతే కేసు నిలవదా?

సినీ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన దృశ్యం' సినిమా కథ అందరికీ గుర్తే. అక్కడ ఒక హత్య జరుగుతుంది, నిందితులు ఎవరో పోలీసులకు స్పష్టంగా తెలుసు. కానీ, బాడీ దొరక్కపోవడంతో హీరో చాకచక్యంగా చట్టం పరిధి నుంచి తప్పించుకుంటాడు. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు కూడా శవం దొరకకూడదని, హీరో సేఫ్ కావాలని టెన్షన్‌తో కోరుకుంటారు. సరిగ్గా ఇదే తరహా సస్పెన్స్, ఉత్కంఠ ఇప్పుడు విజయవాడ కృష్ణలంకకు చెందిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులోనూ కనిపిస్తోంది. సాయికృష్ణ కనిపించకుండా పోయి నెల రోజులు దాటుతున్నా, అతని ఆచూకీ ఏమైందనే దానిపై అటు పోలీసుల దగ్గర, ఇటు కోర్టుల దగ్గర స్పష్టమైన సమాధానం లేదు. చట్టం ముందు ప్రస్తుతం అతను 'మిస్సింగ్' మాత్రమే. "పోలీసులు అతడిని కస్టడీలోనే చంపేశారు.. బూడిద కూడా లేకుండా కాల్పించేశారు" అంటూ వస్తున్న వార్తలన్నీ ప్రస్తుతం కేవలం రాజకీయ ఆరోపణలు, గాసిప్స్‌గానే ప్రచారంలో ఉన్నాయి. ఒకవేళ లాకప్‌లో ఏదైనా అనూహ్య సంఘటన జరిగి ప్రాణాలు పోయి ఉంటే.. సాధారణంగా పోలీసులు ఆసుపత్రికి తరలించడమో, గుండెపోటు అని కవర్ చేయడమో చేస్తుంటారు. కానీ, ఇక్కడ అసలు ఆనవాళ్లే లేకుండా మాయం చేశారనే ప్రచారం దృశ్యం సినిమాలోని పోలీస్ స్టేషన్ కింద శవాన్ని దాచిపెట్టిన ట్విస్ట్‌ను గుర్తుకు తెస్తోంది. ఈ వ్యవహారంలో పటమట, కృష్ణలంక పోలీస్ సర్కిళ్లలో ఏం జరిగిందో ఎవరికీ తెలియదు, పోలీసులు నోరు విప్పడం లేదు. దీంతో ఈ ఉదంతం ఎప్పటికీ ఛేదించలేని ఒక మిస్టరీగా మిగిలిపోనుందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ కేసులో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. తాము సాయికృష్ణను అసలు అదుపులోకే తీసుకోలేదని పోలీసులు కోర్టుకు గట్టిగా చెప్పలేకపోతున్నారు. సాయికృష్ణతో పాటు మార్కాపురంలో పట్టుబడిన మిగిలిన వారిని పోలీసులు విచారించి అప్పట్లోనే వదిలేశారు. వారితో పాటే సాయికృష్ణను కూడా మేము వదిలేశాం, ఆ తర్వాత అతను ఎక్కడికి వెళ్ళాడో మాకు తెలియదు అని చెప్పుకునే లూప్‌హోల్ పోలీసులకు ఉంది. కానీ, తమకు అసలు సంబంధమే లేదని పూర్తిగా తిరస్కరించకుండా, విచారణకు సమయం కోరడమే ఇక్కడ కథను మలుపు తిప్పుతోంది. సాయికృష్ణ ఆనవాళ్లు దొరక్కపోతే, తాము స్టేషన్ నుంచి పంపించేసిన తర్వాతే అతను అదృశ్యమయ్యాడనే వాదనను పోలీసులు తెరపైకి తెచ్చే అవకాశం లేకపోలేదు. దృశ్యం సినిమాలో లాగా శవం దొరక్కపోతే పోలీసులు చట్టపరంగా సేఫ్ అయినట్లేనా అంటే.. న్యాయశాస్త్రం ప్రకారం అలా అనుకుంటే పొరపాటే. కార్పస్ డెలెక్టి సూత్రం ప్రకారం సాధారణంగా నేరాన్ని నిరూపించడానికి భౌతిక ఆధారాలు అవసరమే అయినప్పటికీ.. సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో స్పష్టం చేసినట్లు పరిస్థితుల ప్రభావం బలంగా ఉండి, నిందితుడు చివరిసారిగా ఎవరి ఆధీనంలో ఉన్నాడో రుజువైతే శవం లేకపోయినా శిక్ష ఖరారు చేయవచ్చు." సాయికృష్ణను పోలీసులు తీసుకెళ్లినట్లు సాక్ష్యాలు ఉన్నాయి కాబట్టి, ఆ తర్వాత అతను ఏమయ్యాడో నిరూపించాల్సిన పూర్తి బాధ్యత సెక్షన్ 106 ప్రకారం పోలీసుల పైనే ఉంటుంది. హైకోర్టు విధించిన గడువు లోగా ఆనవాళ్లు దొరక్కపోతే.. ఈ దృశ్యం' తరహా కథ క్లైమాక్స్ పోలీసులకు చుట్టుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఎమ్మెల్సీ కాలేజీల్లో అన్నీ లోపాలే

గుంటూరు, జూన్ 22, (

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తనయుడు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కృష్ణ చైతన్య విద్యాసంస్థల పై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఈ విద్యాసంస్థలకు చెందిన ఆరు జూనియర్ కళాశాలలపై గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ప్రత్యేకంగా వచ్చిన విద్యాశాఖ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఈ తనిఖీలు అర్ధరాత్రి దాటే వరకు సాగాయి. అధికారుల సుదీర్ఘ తనిఖీల్లో సదరు విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఏ ఒక్కటి కూడా సక్రమంగా పాటించడం లేదనే గ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. అగ్నిమాపక శకటం వెళ్లేందుకు కనీస స్థలం లేకపోవడం, ఫైర్ సేఫ్టీ అనుమతులు గడువు ముగిసినా నూతనీకరించకపోవడం, సామర్థ్యానికి మించి ఒకే గదిలో విద్యార్థులను గొర్రెల మందలా ఉంచడం వంటి అనేక లోపాలను అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, ల్యాబ్‌లలో కెమికల్స్ భద్రత సరిగా లేకపోవడం, విద్యార్థులకు కనీస తాగునీరు, పరిశుభ్రమైన శానిటేషన్ వసతులు కూడా కల్పించకపోవడాన్ని కూడా గుర్తించారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఉండేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. పొరుగు జిల్లా అయిన గుంటూరుతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు. కాలేజీ రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లు, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్, హాస్టల్ అనుమతులకు సంబంధించిన ప్రతీ పత్రాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అర్ధరాత్రి దాటే వరకు అటెండెన్స్ సాఫ్ట్‌వేర్ డేటాను, అడ్మిషన్ల రికార్డులను క్రాస్ వెరిఫై చేసిన అధికారులు.. అనుమతులు లేని అదనపు సెక్షన్లను నడుపుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించి ఆయా ఫైళ్లను సీజ్ చేశారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు చైర్మన్‌గా ఉన్న విద్యాసంస్థలు కావడంతో, ఐదేళ్ల హయాంలో ఇక్కడి లోపాలపై స్థానిక అధికారులు కన్నెత్తి కూడా చూడలేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా రూల్స్ ఉల్లంఘించే కార్పొరేట్ కాలేజీలపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ తనిఖీలపై గుంటూరు, నెల్లూరు అధికారులు తుది నివేదికను ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌కు సమర్పించనున్నారు. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కిన కృష్ణ చైతన్య విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు భారీగా జరిమానా విధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉన్నతాధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# చిత్తూరు జిల్లాలో తీవ్ర విషాదం

## భార్య ఇద్దరు పిల్లలకు విషం తాగించి, తాను ఆత్మహత్య చేసుకున్న తండ్రి

చిత్తూరుభార్య అనారోగ్యంతో తల్లడిల్లిన ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఆ తండ్రి భార్య ఇద్దరు పిల్లలకు విషం తాగించి, తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఏటీఎం పిన్ రాసిపెట్టి అంత్యక్రియలకు తమ డబ్బులే వాడాలని వినతి చేసాడు. చిత్తూరు జిల్లా దిగుమసపల్లె పంచాయతీలోని బంగారెడ్డిపల్లి గ్రామంలో భార్య నిర్మల(25), కొడుకు రాజేష్(13), కూతురు శ్రీవిద్య(11)లతో కలిసి దామోదరం(30) అనే వ్యక్తి నివసిస్తున్నాడు.

బ్రెయిన్ స్ట్రోక్తో చికిత్స పొందుతున్న భార్య పరిస్థితి విషమించడంతో, భార్యా పిల్లలకు విషం తాగించి అనంతరం తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్లో ఏటీఎం పిన్ నంబర్, ఫోన్ పే నంబర్ రాసి, అంత్యక్రియలకు తమ డబ్బులే వాడాలని విజ్ఞప్తి చేసాడు.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కదిరిలో సవాళ్లు.. ప్రతి సవాళ్లు

అనంతపురం, జూన్ 22,

సత్యసాయి జిల్లాలో టీడీపీ వర్సెస్ వైసీపీ రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి మధ్య నడుస్తున్న వ్యక్తిగత ఆరోపణలు, సవాళ్ల కదిరి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. ఇరు పార్టీల నేతలు అవినీతి, కబ్జాలు, కుటుంబ సభ్యులపై ఆరోపణలతో బహిరంగ చర్చలకు సై అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు.

కదిరి టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థాయి వేరు.. ఆయన తండ్రి వైఎస్సార్ కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాంటి నాయకుడి భార్యను అకారణంగా రాజకీయాల్లోకి లాగి అవమానిస్తావా అంటూ ప్రవీణ్ రెడ్డి ఎమ్మెల్యేను నిలదీశారు. నీతి, నిజాయితీల గురించి మాట్లాడే ముందు ఎమ్మెల్యే తన గతం, చరిత్ర గురించి ఆలోచించుకోవాలని, మహిళల గురించి మాట్లాడే ముందు కొంత సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారుఎమ్మెల్యే ప్రసాద్ అవినీతి గురించి మాట్లాడితే కదిరి ప్రజలు నవ్వుకుంటున్నారని ప్రవీణ్ రెడ్డి ఎద్దేవా చేశారు. కదిరి నియోజకవర్గంలో బ్రాందీ షాపులు, పల్లెల్లో బెల్ట్ షాపులు పెట్టించి.. మద్యం బాటిల్‌పై రూ. 20 నుండి రూ. 40 వరకు అధికంగా అమ్మించి కమిషన్లు దండుకుంటోంది ఎమ్మెల్యే కాదా? అని ప్రశ్నించారు. ఆ అక్రమంగా వసూలు చేసిన డబ్బులు మీ ఇంట్లో వాళ్లు ఇస్తున్నారా అని మేము అడిగితే అది తప్పు అవుతుందా? అని ఘాటుగా నిలదీశారు. అంతేకాకుండా, కదిరిలో ఎమ్మెల్యే తన ఇంటి ముందున్న దేవుడి మాన్యం స్థలాన్ని 15 ఏళ్లుగా కబ్జా చేసి సొంత పార్కింగ్‌గా వాడుకోవడం నిజం కాదా అంటూ దేవాదాయ శాఖ భూముల కబ్జాపై సంచలన ఆరోపణలు చేశారు. గడిచిన రెండున్నరేళ్ల కాలంలో కదిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమని ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా కదిరిలో మైనార్టీ ముస్లింలపై ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేద ముస్లింలు పెళ్లిళ్లు చేసుకునే ప్రభుత్వ షాదీ మహల్‌కు రెండున్నరేళ్లుగా ఎందుకు తాళాలు వేశారు? వారు చేసిన పాపం ఏంటి? అని ప్రశ్నించారు. ఇది చాలదన్నట్లు, కదిరి కాలేజీ సర్కిల్‌లో కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ బోర్డు స్థలంలో ముస్లింల సమాధులను సైతం తొలగించి, ఆ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా వేసి అమ్ముకోవాలని ఎమ్మెల్యే ప్రయత్నించడం వాస్తవం కాదా అంటూ నిలదీశారు. కదిరిలో తాను అడిగిన సూటి ప్రశ్నలకు ఎమ్మెల్యే ప్రసాద్ నేరుగా సమాధానం చెప్పాలని, తన అనుచరులను ప్రయోగించి పారిపోవద్దని ప్రవీణ్ రెడ్డి సవాల్ విసిరారు. వారిని బలి చేయవద్దు. రేపు ప్రభుత్వం మారితే నీకంటే ముందు వాళ్లే కేసుల్లో ఇరుక్కుంటారు, అప్పుడు వారి పరిస్థితి ఏమిటో ఆలోచించు అని హెచ్చరించారు. మనం ఇద్దరం నేరుగా కూర్చుని కదిరి అభివృద్ధిపై, కబ్జాలపై మాట్లాడుకుందాం. ఏ చర్చకైనా నేను సిద్ధం అంటూ బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. ప్రస్తుతం కదిరిలో వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య జరుగుతున్న ఈ మాటల యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. భూకబ్జాలు, మద్యం మాఫియా, వక్ఫ్ ఆస్తుల ఆక్రమణల వంటి కీలకమైన ఆరోపణలు తెరపైకి రావడంతో స్థానిక రాజకీయాలు వేడెక్కాయి. ప్రవీణ్ రెడ్డి విసిరిన ఈ సవాళ్లపై ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ , టీడీపీ శ్రేణులు ఏ విధంగా స్పందిస్తాయో, ఈ బహిరంగ చర్చ సవాల్ ఎక్కడి వరకు దారితీస్తుందో అని కదిరి ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# ముద్రగడకు భరోసా ఎవరు...

కాకినాడ, జూన్ 22,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన సీనియర్ కాపు నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న ముద్రగడ అస్వస్థతకు గురికావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రి యశోదకు తరలించారు. అయితే, అక్కడ వైద్య ఖర్చులు ఊహించని స్థాయిలో ఉండటంతో.. ఆ బిల్లులు భరించలేక రాత్రికి రాత్రే ఆయనను సమీపంలోని ఒక చిన్న ప్రైవేట్ ఆస్పత్రికి మార్చడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముద్రగడను కేవలం రాజకీయ అవసరాల కోసమే వాడుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , ఇప్పుడు ఆయన వైద్యానికి కనీస భరోసా ఇవ్వకపోవడంపై ముద్రగడ అనుచరులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.గత సార్వత్రిక ఎన్నికల నుంచి వైసీపీకి కాపు అస్త్రంగా ముద్రగడ ఉపయోగపడ్డారు. ఆయనకు ఇష్టం లేకపోయినా, వయసు సహకరించకపోయినా.. ఆయన కుమారుడికి రాజకీయ ప్రాధాన్యత ఇస్తామంటూ, భవిష్యత్తు బాగుంటుందంటూ వైసీపీ అగ్రనాయకత్వం ముద్రగడను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు నాయుడిని, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ముద్రగడతో ఘాటైన లేఖలు రాయించడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం, ఆఖరికి అనారోగ్యంతో ఉన్నా బలవంతంగా వీడియో బైట్స్ విడుదల చేయించడం వెనుక వైసీపీ వ్యూహకర్తలే ఉన్నారన్నది బహిరంగ రహస్యం. తాజాగా సాయికృష్ణ ఉదంతంలో ఆయనతో ఓ లేఖ రాయించేందుకు ప్రయత్నించారు. కానీ ఈలోపే ఆయన ఆసుపత్రి పాలవ్వడంతో కథ అడ్డం తిరిగింది.హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ వైద్య ఖర్చుల విషయంలో సాయం కోరేందుకు ఆయన కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు తాడేపల్లి ప్యాలెస్‌ను, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని సంప్రదించేందుకు గట్టిగానే ప్రయత్నించినట్లు సమాచారం. అయితే, ఈ సంప్రదింపుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని టాక్. అసలు ఎవరూ పట్టించుకోలేదు. కార్పొరేట్ ఆసుపత్రి భారీ ఖర్చులకు సంబంధించిన ఆర్థిక భరోసా లేదా సాయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది.ముద్రగడ పద్మనాభం లాంటి ఒక సీనియర్ లీడర్‌ను ఆపద సమయంలో వైసీపీ ఒంటరిని చేసిందనే వార్త గోదావరి జిల్లాల్లోని కాపు శ్రేణులను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. అవసరమైనప్పుడు పవన్ కల్యాణ్‌పైకి ఉసిగొల్పి.. పంతానికి పోయి పేరు మార్చుకునే దాకా ముద్రగడను వాడుకుని, ఇప్పుడు వైద్యం చేయించుకునే పరిస్థితి వస్తే చేతులెత్తేస్తారా అంటూ క్షేత్రస్థాయి అనుచరులు మండిపడుతున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను తిట్టడానికే ముద్రగడ పనికొచ్చారా.. ఆయన ప్రాణాల కంటే పార్టీ ప్రయోజనాలే ఎక్కువయ్యాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి.ఓ వైపు ముద్రగడ ఆరోగ్యపరిస్థితి బాగోలేక ఆస్పత్రిలో ఉంటే కాపు నాయకుల పేరుతో తోట త్రిమూర్తులు వంటి వారు హడావుడి ప్రారంభించారు. రాజకీయాల్లో యూజ్ అండ్ త్రో జగన్‌కు కొత్తేమీ కాకపోయినా.. ముద్రగడ లాంటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర గల నేత విషయంలో ప్రదర్శిస్తున్న వైఖరి ఆ పార్టీ నైతికతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రత్యర్థులపై బురద చల్లడానికి ఒక సీనియర్ నేత ఇమేజ్‌ను ఎమోషనల్‌గా వాడుకుని, ఆయన ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి బెడ్‌పై ఉంటే ఆర్థికంగా ఆదుకోకపోవడం ముద్రగడ అనుచరులకే కాకుండా తటస్థులకు కూడా మింగుడుపడటం లేదు

# అనంతపురం టూ అమరావతి...

అనంతపురం జూన్ 22,

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వేగంగా చేరుకునేలా ఆయా జిల్లాల్లో ప్రభుత్వం పలు ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో హైవేలు, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వేగంగా చేరుకునేలా ప్లాన్ చేశారు. ఈ రోడ్లకు సంబంధించిన పనులు పూర్తిచేస్తే ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. రాజధాని అమరావతికి అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ ఉండేలా ప్లాన్ చేసింది. కేంద్రం సహకారంతో కొత్తగా రోడ్లకు సంబంధించి ప్రాజెక్టుల్ని తీసుకొచ్చే పనిలో ఉంది. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వెళ్లడానికి హైవేలు, రోడ్లకు సంబంధించిన ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేందుకు నేషనల్ హైవే-544జీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం 624 కి.మీ.ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ విజయవాడ నుంచి బెంగళూరుతో కనెక్ట్ చేస్తోంది. విజయవా నుంచి నేషనల్ హైవే 16 మీదుగా వచ్చి ప్రకాశం జిల్లా ముప్పవరం, అద్దంకి మీదుగా హైవే వెళుతుంది. ఈ హైవే పూర్తి చేస్తే 110 కి.మీ.లు దూరం తగ్గి, ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. ఈ హైవే ప్రకాశం, నెల్లూరు, కడప, శ్రీ సత్యసాయి జిల్లా మీదుగా వెళుతుంది. అలాగే అనంతపురం జిల్లా నుంచి అమరావతి వెళ్లేందుకు రోడ్ల అనుసంధానంపై ఫోకస్ పెట్టారు.మలకవేముల క్రాస్ దగ్గర జంక్షన్ ఏర్పాటు చేసి బీకేవీ (బెంగళూరు, కదిరి, విజయవాడ) ప్రాజెక్టు ద్వారా అనంతపురం జిల్లా జిల్లా నుంచి అమరావతికి కేవలం 5 గంటల్లో చేరేలా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. ముదిగుబ్బ నుంచి కదిరి వరకు 4 లైన్ హైవేను రూ. 707 కోట్లతో నిర్మించనున్నారు. అనంతపురం, బెంగళూరులను అనుసంధానం చేసే రోడ్లను మలకవేముల క్రాస్ దగ్గర కలుస్తాయి. అక్కడి నుంచి నేరుగా విజయవాడకు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి నాలుగు లైన్ల రోడ్డు కూడా ప్రతిపాదించారు. అనంతపురం నుంచి ఉరవకొండకు రోడ్డు ప్రతిపాదన కన్సల్టేషన్ స్థాయిలో ఉంది. గుత్తి - కర్ణాటకలోని బీదర్ హైవే విస్తరణ కూడా చేపట్టారు. అలాగే రూ.230 కోట్లతో గుంతకల్లు - బళ్లారి రోడ్డు విస్తరణకు కొత్తగా టెండర్ పిలిచారు.రాయదుర్గంలో రూ.54 కోట్లతో రైల్వే బ్రిడ్జి, రోడ్డు విస్తరణ పనులు మొదలుకానున్నాయి. రూ.25 కోట్లతో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి రోడ్డు విస్తరణకు టెండర్‌లు ఆహ్వానించారు. కదిరిలో రోడ్లు, డ్రైన్లకు సంబంధించి ఇక రూ.30 కోట్లతో పనులు ప్రారంభించనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నేషనల్ హైవే అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టారు. రోడ్ల విస్తరణతో పాటుగా అన్ని పనుల్ని పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయంటున్నారు. మలకవేముల జంక్షన్ కీలకంగా మారుతుందంటున్నారు. ప్రయాణ సమయం తగ్గి అమరావతికి ఐదు గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. ప్రస్తుతం బెంగళూరు టు విజయవాడ మధ్య నేషనల్ హైవే-544జీ పనులు కూడా చకచకా సాగుతుండటంతో బెంగళూరు, అనంంతపురం నుంచి అమరావతికి , విజయవాడకు త్వరగా వెళ్లొచ్చు.. ప్రయాణ సమయం తగ్గుతుందని భావిస్తున్నారు.

# మూడు సముద్రాలపై భారత్ పట్టు

ముంబై, జూన్ 22

ఆకాశం, నీరు, నిప్పు.. ఈ మూడింటి ఆధారంగానే మనిషి మనుగడ సాగుతూ ఉంటుంది. వీటి మీద పట్టు చిక్కితే మనిషి జీవితం సులభం అవుతుంది. మనిషి అంటే కేవలం ఒకరు మాత్రమే కాదు.. ఈ యావత్ ప్రపంచం. నిప్పు మీద పట్టును కాస్త పక్కన పెడితే.. గగనం.. సంద్రం మీద పట్టు సాధించిన వారే గొప్పగా మనుగడ సాగిస్తూ ఉంటారు.ప్పటివరకు ప్రపంచంలో అమెరికా.. రష్యా.. చైనా.. ఇంకా కొన్ని దేశాలు గగనతలం మీద పట్టు సాధించాయి.. సముద్రంలో కూడా సత్తా చాటాయి. అందువల్లే ఈ దేశాలకు ప్రపంచం మీద పెత్తనం ఎక్కువగా ఉంటుంది. అవి ఏం చెప్తే అదే చేయాలి. ఎలాంటి ఆదేశాలిస్తే వాటిని పాటించాలి.. అయితే ఇప్పుడు భారత్ వాటి సరసన చేరింది. మరి కొద్ది రోజుల్లో అయితే వాటిని మించిపోతుంది. దీనికి ప్రధాన కారణం దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాలు.గడచిన కొంతకాలంగా మన దేశ నౌకాదళ వ్యవస్థలోకి 40 యుద్ధ.. సర్వే నౌకలు.. జలాంతర్గాములు వచ్చాయి. ఇంకా 45 తదుపరి దశలో ఉన్నాయి. అంతేకాదు అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ దునగిరి, సర్వే నౌక, ఐఎన్ఎస్ సంషోదక్, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధనౌక ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలను ప్రధానమంత్రి ప్రారంభించారు. కోల్ కతా లోని శామ ప్రసాద్ ముఖర్జీ పోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో వీటిని జాతికి అంకితం చేశారు. ఈ మూడు నౌకలు అత్యంత ప్రత్యేకమైనవి. వీటివల్ల మన నౌకాదళం మరింత బలాన్ని పెంచుకుందిఇది అత్యంత పెద్దది. స్టెల్త్ ఫ్రిగేట్ విభాగంలో ఇది బాహుబలి లాగా ఉంటుంది. శత్రువుల రాడార్లు.. సెన్సార్లకు ఏమాత్రం చిక్కదు. పైగా ఇది అత్యాధునిక టెక్నాలజీతో పనిచేస్తూ ఉంటుంది. మన నౌకా దళంలో ఐఎన్ఎస్ నీలగిరికి ప్రత్యేకమైన పేరు ఉంది. ఈ ప్రాజెక్టు 17 ఏ లో భాగంగానే దీనిని నిర్మించారు. ఇందులో బ్రహ్మోస్ మిస్సైల్స్.. మిడిల్ రేంజ్ మిస్సైల్స్.. మల్టీ ఫంక్షన్ సర్వే లైన్స్.. ట్రాక్ గైడెన్స్ రాడార్.. సోనార్ సెన్సార్లు.. ఎలక్ట్రానిక్ వార్ ఫెయిర్ వ్యవస్థలు ఇందులో ఉంటాయి. ఇది ఏకంగా 149 మీటర్ల పొడవు..6670 టన్నుల బరువు ఉంటుంది. ఇది గంటకు 52 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుందిఇది హై అండ్ టెక్నాలజీ తో రూపొందించిన హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌక. ఇది పూర్తిగా సముద్ర గర్భాన్ని మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. మహా సముద్రాల లోతును కొలుస్తూ ఉంటుంది. సముద్ర మార్గాలను నిత్యం అన్వేషిస్తూ ఉంటుంది. దీని పొడవు 110 మీటర్లు. బరువు 3400 టన్నులు ఉంటుంది. ఇది గంటకు 18 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణం సాగిస్తూ ఉంటుంది. దీనిని దేశ అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చు. నీటి అడుగున ఇది మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. దూర ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తూ ఉంటుంది. అటానమస్ అండర్ వాటర్ వాహకాలు ఇందులో ప్రత్యేకంగా ఉన్నాయి. మనుషులు లేకుండానే దీని ద్వారా సముద్ర అంతర్భాగంలో పరిశోధనలు సులభంగా చేయవచ్చుదునగిరి, సంషోదక్ వంటి వాటితో పోల్చి చూస్తే అగ్రయ్ అత్యంత చిన్న నౌక.. ఇది పూర్తిగా జలాంతర్గామి విధ్వంసక యుద్ధ నౌక. ఇది శత్రు జలాంతర్గములను గుర్తిస్తూ ఉంటుంది. వాటిని నిత్యం ట్రాక్ చేస్తూ ఉంటుంది. తేలికపాటి టార్పెడో లేదా రాకెట్ల ద్వారా వాటిని ఇది ధ్వంసం చేస్తూ ఉంటుంది. ఇందులో షాలో వాటర్ సోనర్ వ్యవస్థ ఉంటుంది. ఇది అత్యంత కఠినమైన జలాల్లో కూడా పనిచేస్తూ ఉంటుంది.

## కరెంట్ షాక్తో భార్యా భర్తలు మృతి

నిజామాబాద్

బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో దంపతులు మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఉట్పల్లి గ్రామంలో ఉతికిన బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో, రత్నావత్ సంజీవ్(45), జ్యోతి(41) అనే దంపతులు కరెంట్ షాక్తో అక్కడికక్కడే మృతిచెందారు. ముగ్గురు పిల్లలు స్వల్ప గాయాలతో ప్రమాదం నుండి బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీలో సర్..డర్

తిరుపతి, జూన్ 22,

అధికార పార్టీ అయినా.. అపోజిషన్ లీడర్లు అయినా ఇప్పుడు అందరికీ ఒకటే ఫోబియా. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయి.. బెంగాల్‌లో దీదీకి చుక్కలు కనిపిస్తున్నాయి. అటు టీఎంసీ, ఇటు డీఎంకే ఓడటమే కాదు.. రెండు పార్టీల అధినేతలు సీఎంగా ఉండి సొంత సీటులో ఓటమి చవిచూశారు. ఇదంతా సరే. ఆ స్టేట్స్‌లో వాళ్లిద్దరు ఓడితే.. ఏపీలో పార్టీలకు, లీడర్లకు టెన్షన్ ఎందుకనే కదా డౌట్. అక్కడికే వస్తున్నా.. కేంద్రం చేపట్టిన సర్ ప్రక్రియే.. బెంగాల్‌లో గెలుపోటముల్ని డిసైడ్ చేసిందన్న ప్రచారంతో ఢిల్లీ టు అమరావతి.. ఆ సర్ చుట్టూనే రాజకీయాలు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా ఏపీలో అపోజిషన్‌లో వైసీపీ అయితే ఫుల్ అటెన్షన్ మోడ్‌లోకి వచ్చేసింది. అందరికంటే ముందే సర్ పై తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌లో కీలక సమావేశం నిర్వహించిన జగన్.. లీడర్లకు దిశానిర్దేశం చేశారు. అలర్ట్‌గా ఉండాలని.. ఎక్కడా తమ పార్టీకి చెందిన ఓటర్ల ఓట్లు పోకుండా క్రాస్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్. మరణించిన, చిరునామా మారిన, అలాగే డూప్లికేట్ ఓట్లను తొలగించడం, కొత్త ఓటర్లను నమోదు చేయడం సర్ ముఖ్య ఉద్దేశం. 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేసుకుంటూ, తాజా ఓటర్ల వివరాలు సేకరిస్తూ వస్తున్నారు. బూత్ లెవల్ అధికారులు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారు. ఏపీలో ఈ నెల 15న మొదలైన ఈ ప్రక్రియ వచ్చే నెల 15 వరకు.. నెలరోజుల పాటు కొనసాగుతుంది. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటికి వచ్చినప్పుడు ఓటర్లు లేకపోతే అంతే సంగతులు. ఈ మాటే అటు పార్టీలకు.. ఇటు లీడర్లకు కంటిమీదు కునుకు లేకుండా చేస్తోంది. డిసెంబర్‌లో కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ ఏడాది జరిగిన రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేసిందన్న వాదన బలంగా ఉంది. సర్ ప్రక్రియనే కొందరు ముఖ్యనేతల తలరాతలను మార్చేసిందన్న టాక్ వినిపిస్తోంది. సర్ ప్రక్రియ కింద ఒక్క తమిళనాడు రాష్ట్రంలోనే 97లక్షల ఓట్లు తొలగించినట్లు అంచనా. ఈ ఓట్లు తొలగింపు దాదాపు 40 అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని అంటున్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ పోటీ చేసిన కొలత్తూరు నియోజకవర్గంలో ఏకంగా లక్షకు పైగా ఓట్లను ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించారు. ఆయన కొలత్తూరులో 8వేల 795 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పెద్దఎత్తున జరిగిన ఓట్లు తొలగింపే కొలత్తూరులో స్టాలిన్‌ను ఓటమి పాలు చేసిందని బలంగా నమ్ముతున్నారు డీఎంకే నేతలు.ఇక పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షలకు పైగా ఓట్లు డిలీటయ్యాయి. ఆ స్టేట్‌లోని మొత్తం ఓట్లలో ఇది దాదాపు 12 శాతం. ఒక్క ఓటుతోనే నేతల జాతకాలు, తలరాతలు మారుతున్న పరిస్థితి. అలాంటిది 12 శాతం ఓట్లు లేకుండా పోతే..రిజల్ట్ షాకింగ్‌గా ఎందుకుండదవన్న చర్చ జరుగుతోంది. బెంగాల్‌లో 294 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 స్థానాల్లో గెలుపు మార్జిన్ కంటే, అక్కడ తొలగించిన ఓట్లే ఎక్కువ. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ పోటీ చేసిన భవానీపూర్‌లో 50 వేల ఓట్లు డిలీట్ అయ్యాయట. ఆమె 15 వేల ఓట్లతో ఓడిపోయారు. ఆ రెండు రాష్ట్రాల్లో జరిగిన ఓట్ల తొలగింపు..ఫలితాలు తారుమారైన సీన్‌ను గుర్తు చేసుకుంటే చాలు..ఏపీల పార్టీలకు వణుకు పుడుతోందటబెంగాల్, తమిళనాడు ఎన్నికలకు ముందు గా.ఎ.ఖీపై ఏ పార్టీ పెద్ద సీరియస్‌గా కాన్సన్‌ట్రేట్ చేయలేదు. వన్స్ అక్కడ సీన్ మారిపోవడంతో ఏకంగా వరుసపెట్టి సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్‌ను అలర్ట్ చేస్తున్నాయి పార్టీలు. సిట్టింగ్ ఎమ్మెల్యేలే కాకుండా ప్రతిపక్ష నేతలు తమ అనుచరులను.. సర్ ప్రక్రియ చేపడుతున్న సిబ్బంది వెంట తిప్పుతున్నారు. బూత్ లెవల్ ఏజెంట్లను యాక్టివ్ చేస్తున్నారు. ఏ ఓటు తీసేస్తున్నారు.? ఏ ఓటు కలుపుతున్నారన్న దానిపై నాయకులు ఏ రోజుకు ఆ రోజు డేటా తెప్పించుకుని పరిశీలిస్తున్నారట. ముఖ్యంగా గత ఎన్నికల్లో తక్కువ మార్జిన్‌తో అంటే ఐదు నుంచి పదివేలలోపు ఓట్ల తేడాతో విజయం సాధించిన నేతల గుండెల్లో ఎస్ఐఆర్ గుబులు రేపుతోందట. ఈ ప్రక్రియ వచ్చే ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న కంగారు నాయకుల్లో మొదలైంది.అర్బన్ ఏరియాల్లో కంటే రూరల్ ఏరియాలోని దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. చాలామంది గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ఓటర్లు ఉపాధి కోసం లేక వివిధ పనుల నిమిత్తం దగ్గరలో ఉన్న నగరాలకు వెళ్తుంటారు. సర్ ప్రక్రియ కోసం సిబ్బంది ఇంటికి వెళ్లినప్పుడు..డోర్ లాక్ చేసి ఉంటే ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. తాము ఊర్లోనే నివసిస్తున్నామని రుజువు చూపిస్తే తప్ప ఓటు నిలబడే అవకాశం లేదట.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు అధికార పార్టీ నేతలు అయితే ఎన్నికల సిబ్బంది వెంట తమ షాడో టీమ్‌లను పంపిస్తున్నారు. తమకు అనుకూలమైన ఓటర్లను తొలగించడానికి సిద్ధపడితే వెంటనే అడ్డు చెబుతున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందికి కూడా ఇది కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. తమ ఓట్లను కాపాడుకునేందుకు ఇటు అధికార పార్టీ, అటు ప్రతిపక్ష పార్టీలు ఈ నెల రోజులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి చాలా స్పష్టంగా కనిపిస్తోంది.ఏపీలో సర్ ప్రక్రియ ముగిసేలోపు ఎన్ని ఓట్లు గల్లంతవుతాయోనన్న భయం నాయకులను వెంటాడుతోంది. గత ఎన్నికల్లో తక్కువ మార్జిన్‌తో ఓడిపోయిన వారిలోనే కాకుండా, తక్కువ మార్జిన్‌తో గెలిచిన వారిపై కూడా ఎస్ఐఆర్ ప్రభావం ఎంతవరకు ఉంటుందో చూడాలి మరి.

# టీడీపీలో డిజిటల్ సర్వే ప్రకంపనలు

విజయవాడ, జూన్ 22,

ఏపీలో కూటమి పాలనకు రెండేళ్లు అవుతోంది. మూడో సంవత్సరంలో అడుగు పెట్టింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల పనితీరుపై అనేక రకాల విమర్శలు వచ్చాయి. మంత్రుల వ్యవహార శైలిపై కూడా అనేక రకాల ఆరోపణలు ఉన్నాయి. కానీ రెండేళ్ల పాలనలో భారీ వివాదాలు రాకుండా పూర్తి చేయగలిగారు పాలనను. ప్రభుత్వ పెద్దలపరంగా బాగానే కష్టపడుతున్నారు. దానికి తగ్గట్టుగానే మంచి ఫలితాలు వస్తున్నాయి. అయినా సరే ఈ రెండేళ్లలో లోపాలతో పాటు మైనస్లను సరి చేసుకుని ముందుకెళ్తేనే కూటమికి మరో ఛాన్స్ ఉంటుంది. అందుకే ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలతో పాటు మంత్రుల పనితీరుపై ఫీడ్ బ్యాక్ తెలుసుకుంటున్నారు సీఎం చంద్రబాబు. ఇంకోవైపు ప్రముఖ మీడియా సంస్థలు సైతం అంచనా వేస్తున్నాయి.

× ఓ డిజిటల్ మీడియా సర్వే..

తాజాగా మంత్రుల పనితీరుపై ఓ ప్రముఖ డిజిటల్ మీడియా ఒక సర్వే చేసినట్లు తెలుస్తోంది. కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో గెలిచేవారు, పర్వాలేదనిపించుకున్న వారితో పాటు ఓడిపోతారు అనే విషయాన్ని ఆ సర్వే తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న సీఎం చంద్రబాబుతో పాటు 24 మంది మంత్రుల్లో తొమ్మిది మంది కచ్చితంగా గెలుస్తారని సదరు సర్వే తేల్చి చెప్పింది

సీఎం చంద్రబాబు కుప్పం నుంచి మరోసారి గెలుస్తారు అని ఈ సర్వే తేల్చింది. 1983 నుంచి కుప్పం నియోజకవర్గం నుంచి గెలుస్తూ వచ్చారు చంద్రబాబు. 2019లో వైసీపీ గెలుపుతో పాటు కుప్పం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలిచింది. దీంతో వై నాట్ కుప్పం అని నినాదంతో ముందుకు సాగిన వైసీపీకి 2024 ఎన్నికల్లో షాక్ తప్పలేదు. మరోసారి కుప్పం నుంచి చంద్రబాబు కచ్చితంగా గెలుస్తారని ఈ సర్వే తేల్చింది.

పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ మరోసారి తప్పకుండా గెలుస్తారని ఈ సర్వే ద్వారా తేలింది. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా పోటీ చేసిన పవన్ కళ్యాణ్ కు 70 వేలకు పైగా మెజారిటీ వచ్చింది ఈ నియోజకవర్గం నుంచి. మంత్రితో పాటు డిప్యూటీ సీఎం గా ఉండడంతో పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారు. అందుకే ఇక్కడ ప్రజలు మరోసారి పవన్ కళ్యాణ్ కి అవకాశం ఇస్తారు అని ఈ సర్వే ద్వారా తేలింది.

మంగళగిరి నుంచి నారా లోకేష్ కచ్చితంగా గెలుస్తారు. మంత్రిగా ఉంటూ ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.. అయినా సరే మంగళగిరి నియోజకవర్గాన్ని తన సొంత డబ్బులతో అభివృద్ధి చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కనివిని ఎరుగని అభివృద్ధి మంత్రంతో ముందుకు వెళ్తున్నారు. అందుకే అక్కడి ప్రజలు మరోసారి లోకేష్ కు అవకాశం ఇస్తారని తేలిపోయింది.

టెక్కలి నుంచి మరోసారి కింజరాపు అచ్చం నాయుడు గెలుపు తథ్యమని తేలిపోయింది. ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా వీక్ గా ఉంది. ఆపై మంత్రికి మంచి ఇమేజ్ ఉంది. టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారన్న పేరు ఉంది. అందుకే ఇక్కడ ప్రజలు మరోసారి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది.

పాలకొల్లు నుంచి మరోసారి నిమ్మల రామానాయుడుకు ప్రజలు అవకాశం ఇవ్వనున్నారు. తెలుగుదేశం పార్టీకి మంచి పట్టున్న నియోజకవర్గం. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఒకసారి మాత్రమే ఓడిపోయింది. నిమ్మల రామానాయుడు నిత్యం ప్రజల్లోనే ఉంటారు. మంచి నేతగా పేరు ఉంది. ఇక్కడ వైసిపి కొత్త ప్రయోగాలు చేస్తోంది కానీ వర్కౌట్ కాలేదు.

రేపల్లె నుంచి అనగాని సత్యప్రసాద్ మరోసారి గెలుస్తారని ఈ సర్వే ద్వారా తేలింది. అక్కడ ఆయన హ్యాట్రిక్ విజయం సాధించారు. స్థానికంగా మంచి పట్టు సాధించారు. సత్యప్రసాద్ను ఓడించేందుకు వైసిపి చేయని ప్రయత్నం అంటూ లేదు. కానీ అవేవీ వర్కౌట్స్ కాలేదు. ఈసారి కూడా ఆయనదే విజయం అని తేలిపోయింది.

అద్దంకి నుంచి గొట్టిపాటి రవికుమార్ మరోసారి కచ్చితంగా విజయం సాధిస్తారు. ఈ నియోజకవర్గంలో టిడిపి తో పాటు వైసీపీకి పట్టు ఉంది. కానీ వ్యక్తిగతంగా గొట్టిపాటి రవికుమార్ తన ఇమేజ్ పెంచుకున్నారు. ఆయన ఏ పార్టీ నుంచి పోటీ చేసిన గెలుపు తథ్యం అన్నట్టు పరిస్థితి ఉంది. అందుకే మరోసారి ఆయన విజయం ఖాయమని తేలిపోయింది.

గజపతినగరం నుంచి కొండపల్లి శ్రీనివాస్ గెలుపు మరోసారి ఖాయం అన్నట్టు ఉంది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. మంచి ఇమేజ్ ఉంది. అందుకే అక్కడి ప్రజలు ఆయన నాయకత్వానికి మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమైంది.

నిడదవోలు నుంచి మరోసారి జనాలు కందుల దుర్గేష్ కు ఛాన్స్ ఇస్తారని ఈ సర్వే ద్వారా స్పష్టమైంది. పొత్తు ఉన్నంతవరకు నిడదవోలులో కూటమి గెలుపు ఖాయం. పైగా దుర్గేష్ గెలిచిన నాటి నుంచి నియోజకవర్గాన్ని తనదైన రీతిలో అభివృద్ధి చేస్తున్నారు. అది కలిసి వచ్చే అంశం. ఇలా తొమ్మిది మంది కూటమి పాలనలో కచ్చితంగా గెలుస్తారు అని స్పష్టం కావడం విశేషం.

## మాజీ సిఐ నాగరాజు కి మద్దతుగా కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ

విజయవాడ కృష్ణలంక మాజీ సిఐ నాగరాజు కి మద్దతుగా కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ నాగరాజు కృష్ణలంక పిఎస్ లో చార్జి తీసుకున్నప్పటి నుండి రౌడీయిజం మీద ఉక్కు పాదం మోపారు. ముఖ్యంగా కృష్ణలంక ఏరియాలో గంజాయి బ్యాచ్ ఆగడాలను పూర్తిగా అరికట్టారని అన్నారు.ఆడపిల్లలపై ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వాడి కి తమదైన శైలిలో ట్రీట్మెంట్ ఇచ్చి నేరలను అరికట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాత్రిపూట పది తర్వాత ఆడవాళ్లు బయటికి వెళ్లాలంటేనే భయపడే వారు. ఇప్పుడు నాగరాజును ఇక్కడి నుండి తప్పిస్తే మళ్లీ వారి ఆగడాలు ఎక్కువ అవుతాయి. గతంలో రౌడీ షీటర్లను ఎన్కౌంటర్ చేసినప్పుడు దానిని సమర్థించిన పెద్దలు దీన్ని ఎందుకు తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ప్రశ్నించారు.

# నష్టాల బాటలో ఎల్ ఐసీ

ముంబై, జూన్ 22,

స్టాక్ మార్కెట్ అంటేనే ఒడుదొడుకులు ఉంటాయి. విపరీతమైన రిస్క్ ఉంటుంది. ఏ కారణాలతో సూచీలు రాణిస్తాయో, ఏ కారణాలతో పడతాయో, ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ఎప్పుడు ఎందుకు పడుతుందో ముందుగానే ఊహించడం కాస్త కష్టమే. ఎన్నో అంశాలు ఇక్కడ ముడిపడి ఉంటాయి. ఈ ఏడాది మార్చి నుంచి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అమెరికా- ఇరాన్- ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు ఇందుకు కారణం. క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరగడంతో స్టాక్ మార్కెట్లలో కూడా నష్టాలు వచ్చాయి. విదేశీ పెట్టుబడిదారులు పెద్ద మొత్తంలో తమ పెట్టుబడుల్ని ఉపసంహరించుకోవడంతో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. దీంతో ఆ మధ్య భారత మార్కెట్ సూచీలు భారీగా తగ్గాయి.ఇటీవల అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరగా సూచీలు పుంజుకున్నాయి. కిందటి వారంలో జూన్ 15- 19 మధ్య 5 ట్రేడింగ్ సెషన్లలో బొంబాయి స్టాక్ ఎక్స్చేంజి సూచీ సెన్సెక్స్ 1275 పాయింట్లు లేదా 1.68 శాతం ఎగబాకింది. ఈ క్రమంలోనే ఆయా కంపెనీల షేర్లు పుంజుకున్నాయి. టాప్- 10 కంపెనీల్లో 9 కంపెనీల మార్కెట్ వాల్యుయేషన్ రూ. 2.15 లక్షల కోట్ల మేర పెరగడం విశేషం. ఆయా కంపెనీల మార్కెట్ విలువనే మదుపరుల సంపదగా పరిగణిస్తుంటారు. దీంతో ఈ మేర ఇన్వెస్టర్లకు కూడా భారీగా లాభాలు వచ్చాయని చెప్పొచ్చు.ఇక గత వారంలో అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ 5 రోజుల వ్యవధిలో రూ. 52,432.67 కోట్లు పెరిగి రూ. 11.62 లక్షల కోట్లకు చేరుకుంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఒఎల) మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా రూ. 51,675.23 కోట్లు పెరగడంతో ఇప్పుడు రూ. 5.56 లక్షల కోట్లుగా ఉంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ వాల్యుయేషన్ రూ. 26,553 కోట్లు పెరగడంతో ప్రస్తుతం రూ. 5.98 లక్షల కోట్లకు చేరుకుంది.మార్కెట్ విలువ పరంగా భారత్‌లో అతిపెద్ద కంపెనీగా ఉన్నటువంటి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం- క్యాప్ గత వారం రూ. 22,464 కోట్లు పెరగడంతో రూ. 17.71 లక్షల కోట్లుగా ఉంది. లార్సెన్ అండ్ టుబ్రో ఎం- క్యాప్ రూ. 21,929 కోట్లు పెరిగి రూ. 5.79 లక్షల కోట్లుగా ఉంది. ఎస్బీఐ మార్కెట్ విలువ 5 రోజుల్లో రూ. 16 వేల కోట్లకుపైగా పెరగడంతో ప్రస్తుతం ఎం క్యాప్ రూ. 9.55 లక్షల కోట్లకు చేరుకుంది.అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ ఊఆఈఅ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 11,948 కోట్లు పెరిగి రూ. 12.01 లక్షల కోట్ల వద్ద ఉంది. హిందుస్థాన్ యూనిలివర్ మార్కెట్ విలువ రూ. 6661 కోట్లు పెరిగి రూ. 5.15 లక్షల కోట్లుగా ఉంది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం క్యాప్ గత వారంలో రూ. 4724 కోట్లు పెరిగి రూ. 9.66 లక్షల కోట్ల వద్ద ఉంది. ఇదిలా ఉండగా అతిపెద్ద భారత ఐటీ కంపెనీ టీసీఎస్ మార్కెట్ విలువ కిందటి వారం రూ. 12,699 కోట్లు తగ్గి రూ. 7.69 లక్షల కోట్లుగా నమోదైంది.

# ధర్మస్థలి వివాదం వెనుక ప్రకాష్ రాజ్ నాలుగు రాష్ట్రాల కేసులు

బెంగళూరు, జూన్ 22

మధ్య కర్ణాటక రాష్ట్రంలో ధర్మస్థల వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అది కాస్త దేశంలోనే సంచలనం కలిగించింది. ఆ తర్వాత ఈ ఎపిసోడ్ లోకి ప్రకాష్ రాజ్ ప్రవేశించారు. తీవ్రాతితీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.. అక్కడితోనే ఆగిపోలేదు.. హిందువుల మీద.. హిందూ ధర్మం మీద దారుణంగా మాట్లాడారు. జస్ట్ ఆస్కింగ్ పేరుతో ధర్మస్థల అంశం మీద ఏదో ఒక విషయాన్ని ప్రకాష్ రాజ్ తెర పైకి తీసుకొచ్చేవారు.అప్పట్లో ధర్మస్థల వివాదానికి సంబంధించి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నప్పటికీ.. ప్రకాష్ రాజ్ ఊరుకునేవారు కాదు. దీనికి తోడు ఆ ఆలయంలో పనిచేసిన చిన్నయ్య మరింత వివాదాన్ని కలిగించే విషయాలను చెప్పడంతో ప్రకాష్ రాజ్ ఇంకా ఎక్కువ రెచ్చిపోయేవారు. దీంతో ధర్మస్థల ఆలయ ప్రాశస్త్యం చాలావరకు దెబ్బతిన్నది. దీనికి తోడు కొన్ని మీడియా సంస్థలు కావాలని నెగిటివ్ స్టోరీస్ పబ్లిష్ చేసేవి.ధర్మస్థల వివాదం మీద ఇప్పుడు ఒక క్లారిటీ రావడంతో.. ప్రకాష్ రాజ్ అసలు రంగు బయటపడుతోంది. దీనికి తోడు చిన్నయ్య కూడా కీలక విషయాలను చెప్పడంతో.. ఈ వ్యవహారం వెనుక పెద్ద వ్యవస్థీకృత ముఠా ఉన్నట్టు అందరికీ అర్థమవుతోంది. దీని వెనక భారీగానే డబ్బులు చేతులు మారాయని సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించి ఇటీవల ప్రకాష్ రాజ్ బెంగళూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే మధ్యలో వదిలి వెళ్ళిపోయారు.ఇప్పుడిక ప్రకాష్ రాజ్ వ్యవహారం మరో మలుపుతీసుకుంది. ఆయన మీద నాన్ బెయిలబుల్ వారంటీ నమోదయింది. ఆయన ఏకంగా నాలుగు రాష్ట్రాలలో ఓటర్ గుర్తింపు కార్డులు కలిగి ఉన్నారంటూ కేసు దాఖలయింది. 48వ ఏసీజేఎం కోర్టు శనివారం ప్రకాష్ రాజ్ కు వారెంట్ జారీ చేసింది. ప్రకాష్ రాజ్ పలచోట్ల ఓట్ హక్కు కలిగి ఉన్నారంటూ దిలీప్ కుమార్ అనే లాయర్ 2019లో బెంగళూరు నగరంలో హలసూరు గేటు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆయన బిబి ఎంపీ.. కేంద్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో కోర్టులో పిటిషన్ వేశారు. ప్రకాష్ రాజ్ తమిళనాడు.. ఆంధ్ర ప్రదేశ్.. కర్ణాటక.. తెలంగాణ రాష్ట్రాలలో ఓటు హక్కులు కలిగి ఉన్నారని దిలీప్ కుమార్ ఆరోపిస్తున్నారు. అయితే ఈ కేసు విచారణకు ప్రకాష్ రాజ్ హాజరు కాకపోవడంతో కోర్ట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడం విశేషం.

## వారాసిగూడలో పోలీసులు సైబర్ నేరాల అవగాహనా కార్యక్రమం

వానాసిగూడ జూన్ 22,

సోమవారం నాడు వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు మరియు సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన అటువంటి జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా చిలకలగూడ ఏసీపీ కె.శశాంక్ రెడ్డి , వారాసిగూడ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు పంపే మెసేజ్లకు కానీ, వీడియో కాల్స్ కు కానీ ఎవరు స్పందించవద్దు, వారికి డబ్బులు పంపవద్దని సూచించారు. తమ తమత రాదు, వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని అన్నారు. నిర్ధారించుకున్న తర్వాతనే మీరు అవతలి వ్యక్తులకు డబ్బులు పంపించాలి. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురి అయితే వెంటనే గోల్డెన్ అవర్లో 1930 కు కాల్ చేసి సమాచారం అందజేస్తే జీరో ఎఫ్ఫైర్ నమోదు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్ కి పంపుతామని అన్నాడు. తద్వారా ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది. డబ్బులు ఎవరైనా కోల్పోతే కోర్టు నిబంధనల మేరకు డబ్బులను తిరిగి ఇప్పించడానికి వీలవుతుంది, కనుక ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇతరులకు సైబర్ నేరాలు జరగకుండా అవగాహన కల్పించాలని అన్నారు.

## చెరువు మట్టిని అక్రమంగా తరలించి రాత్రికి రాత్రి మట్టికట్ట నిర్మాణం:

రామడుగు: జూన్ 22,

రామడుగు మండలం శ్రీరాములపల్లి గ్రామంలోని కాసారపుకుంట వద్ద నిర్మించినటువంటి గేట్ వాల్ నీటిని వదిలే గ్రావిటీ డ్రైనేజీని రైతు కూల్చడమే కాకుండా కట్టను ర్యాంప్ చేసి డ్రైనేజీకి అడ్డుగా చెరువు మట్టిని అక్రమంగా రాత్రికి రాత్రి తరలించి మూడు మీటర్ల ఎత్తుతో సుమారు 50 గజాల పొడవుతో మట్టి కట్ట నిర్మించడంతో కింద ఉన్న పొలాల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెరువు కట్ట వెంబడి ఎడ్లబండ్ల బాట కలదని అట్టి బండ్ల బాట కనుమరుగైందని ఇట్టి బాటగుండా మత్తడి నీరు రైతుల పొలాల వెంబడి వెళ్లేదని నీటిని పొలాల వెంబడి వెళ్లకుండా కందకం త్రవ్వి మూడు మీటర్ల మట్టి దిబ్బలు పోయడం వల్ల అధిక వర్షాలు కురిస్తే ఆ వర్షపు నీటి ఒత్తిడి పెరిగే దిగువనున్న రైతుల పొలాలలో ఇసుక మట్టి మెటల్ ఏర్పడి పంట నష్టం కలుగుతుందని గ్రామ రైతులు తెలిపారు.ఇట్టి విషయంపై ఇరిగేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ మల్లయ్యను వివరణ కోరగా గతంలో ఇరువర్గాలను పిలిచి హెచ్చరించడం జరిగిందని మోకా విచారణ జరిపి రైతులకు నష్టం కలగకుండా గతంలో ఉన్నటువంటి తూమ్ గేట్ వాల్ యొక్క డ్రైనేజీని పునరుద్ధించడం తోపాటు శాశ్వత పరిష్కారం చూపుతామని వారు తెలిపారు.ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రైతులకు నష్టం కలగకుండా పరిష్కారం చూపాలని రైతులు పత్రిక ముఖంగా అధికారులను వేడుకొంటున్నారు.

## బేగంపేట లో మల్కాజిగిరి సిపి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పర్యటన

బేగంపేట

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితిని అంచనా వేయడానికి మరియు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను సమీక్షించడానికి మల్కాజిగిరి సిపి సుమతి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తో కలిసి బేగంపేట చికోటీ గార్డెన్ వద్దకు చేరుకుని వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ట్రాఫిక్ అంతరాయాలను పరిష్కరించడానికి తీసుకుంటున్న చర్యలను వారు దగ్గరుండి సమీక్షించారు.

## దేవాదాయ శాఖలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి కూటమి ప్రభుత్వం నాంది

### 111 దేవాలయాల్లో అన్నప్రసాద వితరణ చేస్తూ ఏటా 3 కోట్ల మంది భక్తులకు ఉచిత అన్నదానం:మంత్రి ఆనం

అమరావతి జూన్ 22,

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర సచివాలయంలోని ఐదవ బ్లాకులో దేవాదాయ శాఖ గత రెండేళ్లలో సాధించిన విజయాలు,చేపట్టిన సంస్కరణలు, భవిష్యత్ కార్యాచరణ పై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయ శాఖ శాఖ సలహాదారుడు , హిందూ ధర్మ ప్రచార ట్రస్ట్ చైర్మన్, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, దేవాదాయ శాఖ కమిషనర్, సీతా డైరెక్టర్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ల తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ మీడియా సమావేశంలో మంత్రి ఆనం మాట్లాడుతూ గతంలో దెబ్బతిన్న హిందూ భక్తుల విశ్వాసాన్ని పునరుద్ధరించి, దేవాదాయ శాఖలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి కూటమి ప్రభుత్వం నాంది పలికింది. రాష్ట్రంలోని 6,137 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకాన్ని రెట్టింపు చేసి, వార్షిక వ్యయాన్ని రూ.35 కోట్ల నుంచి రూ.73 కోట్లకు పెంచామని అన్నారు.

నిర్లక్ష్యానికి గురైన 692 పురాతన ఆలయాల అభివృద్ధికి రూ.813 కోట్ల సర్వశ్రేయోనిధి నిధులు మంజూరు చేసి చరిత్ర సృష్టించాం. టీటీడీ సహకారంతో రూ.750 కోట్ల వ్యయంతో 5,000 శ్రీవాణి భజన మందిరాల లక్ష్యం ? ఇప్పటికే 1,270 భజన మందిరాలకు అనుమతులు, రూ.267 కోట్ల కేటాయించాం. దేవాలయాలను కేవలం పూజా స్థలాలుగా కాకుండా హిందూ సమాజ ఆత్మగౌరవ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నాం.

జనవరి 2026లో 840 లావాదేవీలతో ప్రారంభమైన "మన మిత్ర" సేవలు మే 2026 నాటికి 1.93 లక్షల లావాదేవీలు నమోదు చేసి కొత్త రికార్డు సృష్టించాయి. రాష్ట్రంలోని 22,672 దేవాలయాలకు చెందిన 4.48 లక్షల ఎకరాల ఆస్తుల రక్షణకు బ్లాక్చెయిన్ ఆధారిత డిజిటలైజేషన్ ప్రారంభించాం. 970 దేవాలయాలకు ట్రస్ట్ బోర్డులు ఏర్పాటు చేసి, పారదర్శకత జవాబుదారితనాన్ని పెంచాము... అలాగే ప్రతి బోర్డులో బ్రాహ్మణుడు ? నాయీబ్రాహ్మణుడికి ప్రాతినిధ్యం కల్పించాం. 111 దేవాలయాల్లో అన్నప్రసాద వితరణ చేస్తూ ఏటా 3 కోట్ల మంది భక్తులకు ఉచిత అన్నదానం అందిస్తున్నాం. గత రెండేళ్లలో రాష్ట్ర ప్రధాన ఆలయాల భక్తుల సందర్శన 70 శాతం పెరిగి, దేవాలయాలపై ప్రజల విశ్వాసం మరింత బలపడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో 22 ప్రధాన దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు రూపొందిస్తూ ఆధ్యాత్మిక మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ను దేవాదాయ శాఖలో విలీనం చేసి వేద పరిరక్షణ, అర్చక సంక్షేమం, బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలకు కొత్త దిశ చూపామని అన్నారు.

2027 గోదావరి పుష్కరాలను మహాకుంభమేళా స్థాయిలో నిర్వహించేందుకు రూ.71.60 కోట్లతో తొలి దశలో 162 పనులు ప్రారంభించాం. టీటీడీలో రెండేళ్లలో పారదర్శక పాలన, ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ సెంటర్, రికార్డు స్థాయి భక్తుల దర్శనాలు, సనాతన ధర్మ ప్రచారంతో తిరుమల వైభవాన్ని మరింత పెంచాం. విధ్వంసం నుంచి వికాసం వైపు... విశ్వాస పునరుద్ధరణ నుంచి ధర్మ పరిరక్షణ వరకు... ఆంధ్రప్రదేశ్ను దేశానికి ఆధ్యాత్మిక ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి అన్నారు.

## అమర్‌నాథ్ యాత్రకు 'ఆపరేషన్ శివ'

జూలై 3వ తేదీ నుంచి మొదలయ్యే అమర్‌నాథ్ యాత్రకు మునుపెన్నడూ లేని విధంగా భారీ భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. ఆపరేషన్ శివ పేరుతో సైన్యం ఈసారి ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేస్తోంది. యాత్రకు సరికొత్త టెక్నాలజీతో యాంటీ?డ్రోన్ వ్యవస్థతో భద్రతను కల్పించనుంది.సున్నితమైన 55 ప్రాంతాల్లో అత్యాధునిక యాంటీ?డ్రోన్ గన్‌లు, నిఘా పరికరాలను మోహరించారు.దేశంలోనే మొదటిసారిగా ఇంత పెద్ద సంఖ్యలో ఇలాంటి వ్యవస్థను ఉపయోగించడం ఇదే మొదటిసారి. ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు, ప్రత్యేక నిఘా వ్యవస్థలు శత్రు డ్రోన్లను గుర్తించి క్షణాల్లో నిరీ?వర్యం చేయగలవు. సుమారు 400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జమ్మూ?శ్రీనగర్ జాతీయ రహదారి, బాల్తాల్, పహల్గామ్ మార్గాలను ఈ వ్యవస్థ పర్యవేక్షిస్తుంది. ఆర్మీ నార్తర్న్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ స్వయంగా బాల్తాల్, సోన్‌మార్గ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

కమాండోల మోహరింపు:

యాత్ర మార్గంలో క్యూఆర్‌టీ, క్యూఈటీ, బాంబు నిరోధక దళాలు, డాగ్ స్క్వాడ్‌లు, మౌంటెన్ రెస్క్యూ టీమ్‌లను అందుబాటులో ఉంచారు. లఖన్‌పూర్ నుంచి పవిత్ర అమర్‌నాథ్ గుహ వరకు ఉన్న మార్గాన్ని హై అలర్ట్ జోన్‌గా ప్రకటించారు. సరిహద్దుకు దగ్గరగా ఉన్నందున అదనంగా బలగాలను నియమించారు.

## నా బిల్డింగ్ కు బలి ఇవ్వలేదు.. మీ శవంతో బలి ఇస్తా అంటూ బెదిరింపులు..

**కాల్చి పారేస్తే అడిగే దిక్కులేదు..**

**కులం పేరుతో దూషిస్తూ దాడులు,నెంబర్ వన్ శ్రీధర్ రావు మీద అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎం ఆర్ పీ ఎస్ నేతల డిమాండ్.**

**పెద్ద ఎత్తున జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ను తరలి వచ్చిన నేతలు.**

బాధితుల కథనం ప్రకారం.. గుంటి శ్రీధర్ రావు అనే వ్యక్తి జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 9లో అరింతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. దీనిలో ఏసీలు బిగించేందుకు వచ్చిన టెక్నీషియన్లు, కంపెనీ ప్రతినిధులను గదిలో బంధించి చితకబాదదంతో పాటు కులం పేరుతో దూషిస్తూ గన్ తో కాల్చేసి తన బిల్డింగ్ కు బలి ఇస్తా అంటూ అరాచకం సృష్టించారు...ఈ మేరకు బాధితులు పది రోజుల క్రితమే క్రితమే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదు దాంతో సోమవారం పెద్ద సంఖ్యలో ఎం ఆర్ పీ ఎస్ నేతలు కార్యకర్తలు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. నలుగురు ముఖ్యమంత్రుల మద్దతు తనకు ఉందంటూ శ్రీధర్ రావు విర్రవేగుతున్నారు అని.. గన్ లైసెన్స్ వెంటనే క్యాన్సల చేసి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు

## సంతమాగులూరు మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి, 7 మందికి తీవ్ర గాయాలు

సంతమాగులూరు జూన్ 22,

కామేపల్లి?వెల్లలచెరువు మధ్య ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న ఆటో లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో శావల్యపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఆటోలో ప్రయాణిస్తున్న మరో 7 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మృతుల వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

=========================

## తిరుమలగిరిలో ఘనంగా సెయింట్ ఆంథోని ఫీస్ట్ వేడుక

### ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి 108 బజార్‌లోని సెయింట్ ఆంథోని చర్చ్‌లో ఆదివారం నిర్వహించిన ఫీస్ట్ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.ఈ వేడుకకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఫీస్ట్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ "సెయింట్ ఆంథోని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా శాంతి, సౌభాగ్యాలతో, సోదరభావంతో జీవించాలని, మతసామరస్యానికి కంటోన్మెంట్ ఎప్పుడూ ఆదర్శంగా నిలుస్తుందని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళీ ముదిరాజ్, చర్చ్ పాస్టర్లు, చర్చ్ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

-------------------------

## డీటీవోను ఢీకొన్న టిప్పర్.. అక్కడికక్కడే మృతి

భూపాలపల్లి

వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారిని బొగ్గు టిప్పర్ లారీ ఢీకొట్టింది. దాంతో జిల్లా రవాణ శాఖాధికారి(ఊ) వెంకన్న అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనలో మృతదేహం నుజ్జు నుజ్జైయింది. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టీవో కార్యాలయం ఎదుట పరకాల ? భూపాలపల్లి హైవేపై ఘటన జరిగింది. మృతుడు వెంక్న 15 రోజుల క్రితమే భూపాలపల్లికి బదిలీ మీద వచ్చారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు.

## చక్రాయపేట అక్రమ ఇసుక క్వారీ వద్దకు వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

కడప కడప జిల్లా చక్రాయపేట అక్రమ క్వారీ కుంటలో పడి జయంత్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి మృతి చెందిన ఘటనపై ఎంపి అవినాష్ రెడ్డి స్పందించారు. సోమవారం ఉదయం క్వారీ వద్దకు వెళ్లారు. చిన్నారుల మృతదేహాలకు నివాళులు అర్పించి తల్లిదండ్రులను ఓదార్చారు.

# ప్రతి పేదవాడికి ఇంటి కొరకు మరో ఇండ్ల పోరాటానికి వామపక్షాలు సంసిద్ధం

## ప్రతి నిరుపేదకు ఇల్లు,
## ఇల్లు ఉన్నవారికి పట్టాలకు సర్వేలు, దరఖాస్తుల స్వీకరణ
## 10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శన
## జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్దఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు
## పేదలకు ఇళ్లను సాధించడమే లక్షంగా సమరశీల పోరాటాలు
## మహత్తర గుడిసెల పోరాటానికి' ఏ పేరు పెట్టాలనేది జూలై 2న జరుగు సమావేశం లో స్పష్టత
## కూనంనేని సాంబశివరావు వెల్లడి..

.హైదరాబాద్: జూన్ 22,

రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ఇళ్లు, ఇంటి స్థలం సాధించడమే లక్షంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమం తరహాలో మరో పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. ఇందులో భాగంగా గుండ్ల సింగారం, గోపాల్ పూర్ తొలగించిన గుడిసెల స్థానాలలో పేదలకు ఇళ్ల కట్టించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐ(ఎం) ఇతర వాపపక్ష పార్టీల ఆధ్వర్యంలో 10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హనుమకొండ జిల్లాలోని గుండ్ల సింగారంలో పేదలు నిలువ నీడ కోసం వేసుకున్న గుడిసెలను అధికారులు బందిపోటు దొంగలల చోరబడి రాత్రి రాత్రికి వాటిని తొలగించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్సుహాంతో అధికారులు ఎక్కడెక్కడ గుడిసెలు తొలగించారో అక్కడ తిరిగి గుడిసెవాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లేకపోతే ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తామని వారు హెచ్చరించారు.

సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ, సిపిఐ ఎంఎల్ సి నెల్లికంటి సత్యం,హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, వరంగల్ జిల్లా సెక్రటరీ బాషామియా, హనుమకొండ జిల్లా పార్టీ కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ , సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, ఎంసిపిఐ నాయకులు సుధాకర్, ఎస్ నాయకులు భరత్ పాల్గొన్నారు. పేదలకు ఇళ్లను సాధించడమే లక్షంగా నమరశీల పోరాటాలు : కూనంనేని సాంబశివరావునమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు దక్కేలా కమ్యూనిస్టు పార్టీలు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని వామపక్ష పార్టీలు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన దశల వారి ఉద్యమ కార్యాచరణను ఆయన వెల్లడించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్దఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదల నుంచి దరఖాస్తులను సేకరించి జూలై 6న హైదరాబాద్ (ఇందిరాపార్క్) వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను నేరుగా సమర్పిస్తామన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి స్పందన మేరకు తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వారు చెప్పారు. ఈ 'మహత్తర గుడిసెల పోరాటానికి' ఏ పేరు పెట్టాలనేది జూలై 2న సమావేశమై నిర్ణయించనున్నట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి ఇళ్ళను కూల్చడం దుర్మార్గంహనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో గత 4 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి సమయంలో గ్రామంపై పడి ఎలాంటి విచక్షణ లేకుండా పేదల ఇళ్ళను కూల్చివేయడం దుర్మార్గమని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా బలవంతంగా లాగిపడేసి అడ్డంవచ్చిన యువకులు, వృద్ధుల కాళ్ళు చేతులు మడిచి మరీ బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి, సుమారు 300 నుండి 400 మందిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒకప్పుడు అక్కడ ఉన్న 'కోమల కుంట' అనే చెరువును ప్రభుత్వం పూడ్చి, ఎస్ కాల్వను తవ్వేందుకు సిద్ధమైందని, ఇదే క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో 2009లోనే అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి సర్వే నంబర్ 174, 175 కింద ఉన్న 56 ఎకరాల భూమిలో దాదాపు 1400 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మరో 40 మందికి ఇక్కడే పట్టాలు ఇవ్వగా ప్రస్తుతం బాధితులు కేవలం 8 ఎకరాల పరిధిలోనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ, కాల్వ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకపోయినా అధికారులు అత్సుహాంతో గుడిసెలు కూల్చివేశారని, ఇప్పటికే ఈ సర్వే నంబర్లలోని వందలాది ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని, వాటిని ఎందుకు కూల్చివేయలేదని ఆయన ప్రశ్నించారు. ఈ కూల్చివేతలకు సంబంధించి స్థానిక ఎంఎల్ ఏ వివరణ కోరగా తనకు తెలియదని తప్పించుకున్నారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, సలహాదారు నరేందర్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇదే తరహాలో రెండు రోజుల కింద గోపాల్ ప్రాంతంలో సిపిఐ(ఎం) నాయకత్వంలో పేదలు వేసుకున్న గుడిసెలను కూడా ఎలాంటి దయాదాక్షిణ్యాలు లేకుండా కూల్చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేశారన్నారు. గతంలో వెలుగుమట్లలోనూ ఇలాగే జరిగిందని, కూల్చేసిన చోటే మళ్ళీ ఇళ్ళు కట్టించి ఇస్తామని ప్రభుత్వం చెప్పడం వారి ద్వంద్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు. గోపాల్ గుండ్ల సింగారం బాధితులకు వెలుగుమట్ల తరహాలోనే ప్రత్యామ్నాయ ఇళ్ళు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగరంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు 25, 30, 50 గజాల లోపు చిన్న చిన్న గుడిసెల్లో, మురికివాడల్లో నివసిస్తున్నారని వివరించారు. వీరంతా భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, మిగులు భూముల్లో దశాబ్దాలుగా ఉంటున్నారని వీరందరికి పట్టాలను ఇవ్వాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. పేదలపై అక్రమ కేసులు అన్యాయం : అబ్బాస్ అబ్బాస్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్ వెలుగుమట్ల, జగిత్యాల ప్రాంతాల్లో పేదలు వేసుకున్న దాదాపు 2 వేల గుడిసెలను ప్రభుత్వం అమానుషంగా కూల్చివేయడాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. పేదలపై అక్రమంగా కేసులు బనాయించి 40 నుండి 50 రోజుల పాటు జైళ్లలో పెట్టడం అత్యంత దారుణమన్నారు. 2007లో జరిగిన భూపోరాటంలో ముదిగొండ కాల్పుల్లో ఏడుగురు పేదలు ప్రాణాలు కోల్పోయారని, ఆతర్వాతే అప్పటి సిఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు 'ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని' ప్రారంభించారని గుర్తు చేశారు. నాడు ఆ పథకం కింద పట్టాలు పొందిన వారి ఇళ్లను కూడా నేడు ప్రభుత్వం కూల్చివేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.పేద ప్రజలపై బుల్డోజర్లు ఎక్కించకండి: గోవర్ధన్ప్రభుత్వం పేద ప్రజలపై యుద్ధం చేయవద్దని, వారిపై బుల్డోజర్లు ఎక్కించి ఉసురు పోసుకోవద్దని కె.గోవర్ధన్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 'గుడిసె రహిత' లేదా ఇల్లు లేని కుటుంబం అంటూ ఏదీ లేకుండా, ప్రతి కుటుంబానికి నిలువ నీడ ఉండేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొంగల్లాగా, బందిపోట్లలాగా తెల్లవారుజామున వెళ్లి ఇళ్లను కూల్చడం సరైన పద్ధతి కాదన్నారు. కమ్యూనిస్టులుగా తాము ఎలాంటి గొంతెమ్మ కోరికలు కోరడంలేదన్నారు. కేవలం పేదలు తల దాచుకునేందుకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కబ్జాల చిట్టా ఇస్తాం.. చర్యలు తీసుకోండి: సుధాకర్నిలువ నీడ లేని పేదల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్ట్ పార్టీలేనని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయో, ఎక్కడెక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను అక్రమించుకున్నారో ఆ వివరాలన్నీ తాము ఇస్తామని, ధైర్యముంటే వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సుధాకర్ సవాల్ చేశారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని వెలుగులోకి తెచ్చింది కమ్యూనిస్టులేనని, బడా బాబుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడుతున్నది కూడా తామేనని స్పష్టం చేశారు.అధికారుల అత్యుత్సాహంపై విచారణ జరపాలి : భరత్ కొంతమంది పోలీస్ అధికారులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు కొందరు పెద్దల అండతో పేదలపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఇళ్లను కూల్చివేస్తున్నారని భరత్ ఆగ్రహంవ్యక్తం చేశారు. అసలు ఈ కూల్చివేతలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతున్నాయా లేక అధికారులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఒక వేళ ప్రభుత్వం నుండి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా, అధికారులే సొంత నిర్ణయాలతో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ పేదలపై దాడులకు తెగబడుతున్న అధికారులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి.
## ఆటో కార్మిక సంఘం సిఐటియుమండల గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్

పరవాడ. జూన్ 22,

యుద్ధ ముగిసిన ప్రజలకు ఉపశమనం కల్పించని ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ముత్యమాంబ ఆటో కార్మిక సంఘంసిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పరవాడ మండలం వాడ చీపురుపల్లిలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులుగనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పెరుగుతున్న జీవన వ్యయం, ఇంధన ధరల భారం కారణంగా ఆటో కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధరలు గతంతో పోలిస్తే తగ్గుముఖం పట్టాయని, ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ముగిసింది.అయితే తగ్గిన కూడ ఆయిల్ ప్రయోజనాన్ని ప్రజలకు అందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించడంలో ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. ప్రజలపై పన్నుల భారం మోపడం ద్వారా ప్రభుత్వాలు భారీ ఆదాయం పొందుతున్నాయని, కానీ ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్పై విధిస్తున్న పన్నులను తగ్గించి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులపైనే కాకుండా వ్యవసాయం, రవాణా, చిన్న వ్యాపారాలు, నిత్యావసర వస్తువుల ధరలపై కూడా పడుతోందన్నారు. ఆటో కార్మికుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు. రోజంతా కష్టపడి పనిచేసినా ఇంధన ఖర్చులు, వాహనాల నిర్వహణ వ్యయాలు, విడిభాగాల ధరలు పెరగడంతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల నుంచి తీసుకున్న రుణాల వాయిదాలు చెల్లించలేక అనేక మంది ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. వంటగ్యాస్ ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు కూడా నిరంతరం పెరుగుతుండటంతో సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందని పేర్కొన్నారు. ప్రజల ఆదాయాలు పెరగకపోయినా జీవన వ్యయం మాత్రం రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన ధరలను తగ్గించడంతో పాటు ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బీమా, పెన్షన్, ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు షేక్ షబాన్, కే. అప్పలనాయుడు, నరసింహమూర్తి, పైల. తాతారావు, తలారి రామకృష్ణ, పోలవరపు తాతారావు, కూండ్రపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలి..
## ఆల్ ఇండియా స్టూడెంట్స్, జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్...

జమ్మికుంట, జూన్ 22,

.జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి వారి ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని, ఆల్ ఇండియా స్టూడెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్, ఈ సందర్భంగా మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నేడు ప్రైవేట్ పాఠశాలలో ఐఐటి మెడికల్ ఫౌండేషన్ కర్యులం ఆక్టివిటీస్ పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ వారి రక్తాన్ని జలగల పిలుస్తున్నారు, అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్న ఆలోచన విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయింది, విద్యదానం చేయాల్సినటువంటి విద్యా సంస్థలు విద్యార్థుల పాలిట శాపంగా మారి వేలాది రూపాయల ఫీజులను దండుకుంటున్నారు, నేడు ప్రైవేట్ విద్యా సంస్థలు డబ్బుల మీద ఉన్నటువంటి వ్యామోహం విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయింది, ప్రతి విద్య సంవత్సరం విద్యార్థుల మార్కుల పాస్ పర్సంటేజ్ లో మాత్రం విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నాయి, అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్నటువంటి ఆలోచన విద్యార్థులు భవిష్యత్తు మీద ఉంటే బాగుంటుందని, విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించకుండా అధిక ఫీజుల దోపిడికి పాల్పడుతున్నటువంటి పలు ప్రైవేట్ పాఠశాల పైన ఎంక్వయిరీ చేసి శాఖ పరమైనటువంటి చర్యలు తీసుకోవాలని అమ్మ వెంకటేష్, ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు..

# మెరుగైన వైద్య సేవలు అందించాలి: ఎమ్మెల్యే

సూర్యాపేట జూన్ 22,

పట్టణంలోని హుజూర్ నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జి వీ హాస్పిటల్ ను స్థానిక సభ్యురాలు పద్మావతి రెడ్డి ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె హెల్త్చెకప్చేయించుకున్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూదిన దినాభివృద్ధి చెందుతున్న కోదాడ పట్టణానికి జీ వీ హాస్పిటల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు కోదాడ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని డాక్టర్లకు యాజమాన్యానికి సూచించారు. పేదలకు అతి తక్కువ ఖర్చులో నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. వైద్యులు సేవాభావంతో పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, రాబోయే రోజుల్లో వైద్యం అంటే కోదాడ గుర్తుకు వచ్చేలా పనిచేయాలని గుర్తు చేశారు.జీవి హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది సేవలు అందుబాటులో ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో , కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్ పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి, కాంగ్రెస్ నాయకులు ఎర్నేని బాబు , కారింగుల అంజన్ గౌడ్,అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు ,మున్సిపల్ కౌన్సి లర్లు, కందుల కోటేశ్వరరావు , కాంగ్రెస్ మహిళ నాయకులు కోదాడ టౌన్ లో ఉన్న వివిధ హాస్పిటల్ డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

==========================

# డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి :
## గుండాల ఎస్సై ఎం. శోభన బాబు. :

గుండాల , జూన్ 22,

మండలంలోని వెల్మజల గ్రామంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండాల సబ్ ఇన్స్పెక్టర్ ఎం. శోభన బాబు ముఖ్యంగా పాల్గొని విద్యార్థులు, యువత మరియు గ్రామ ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎస్సై శోభన బాబు మాట్లాడుతూ, మత్తు పదార్థాల బారిన పడిన వ్యక్తుల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్కు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసైతే భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజం తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు.డ్రగ్స్ వద్దు ? స్పోర్ట్స్ ముద్దు" అనే నినాదంతో యువతను క్రీడల వైపు మళ్లించాలని ఆయన సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ అంకిత్

భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 22 (భారతశక్తి): ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన తో కలిసి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామూహిక సమస్యలను శ్రద్ధగా విని, ప్రతి వినతిపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిగణించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వెంటనే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం లేదా జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజా సేవలో పారదర్శకత, జవాబు దారీతనం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజావాణిలో అందిన పలు వినతులను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.

ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తు

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన వేపల లక్ష్మి తాను ఇంజినీరింగ్ పూర్తి చేశానని, భర్త అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఇద్దరు పిల్లల సంరక్షణ బాధ్యత తనపై ఉందని పేర్కొంటూ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ ఉపాధి కల్పన అధికారికి తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన షేక్ సఫియా తాము నివాసం ఉంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, వర్షాకాలంలో వర్షపు నీరు ఇంట్లోకి చేరుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు. దమ్మపేట మండలం మల్లారం మోడల్ కాలనీకి చెందిన మోదంపరుపు సత్యవతి తాము నిరుపేద కుటుంబానికి చెందినవారమని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమకు ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామపంచాయతీకి చెందిన గ్రామస్తులు తమ గ్రామ పరిధిలోని చెరువులు, వాగుల్లో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. గతంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉమ్మడి గ్రామపంచాయతీ పేరుతో కొనసాగిందని, నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు నేపథ్యంలో రామచంద్రునిపేట గ్రామపంచాయితీ ఏర్పడినందున ఆ గ్రామపంచాయితీ పేరుతో కొత్త మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరారు. ఈ వినతిని పరిశీలించిన కలెక్టర్ జిల్లా మత్స్యశాఖ అధికారికి తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు. పాల్వంచలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో పార్ట్‌టైమ్ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయనిర్మల, పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులు తెలుగు



సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేదనే కారణంతో తనను విధుల నుండి తొలగించారని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర పాఠశాలల్లో ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులను తొలగించలేదని, తనకు న్యాయం చేసి తిరిగి విధుల్లో కొనసాగేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్‌సీఓకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను పాటించాలి ఆహార విక్రయ కేంద్రాలను తనిఖీ చేయాలి: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ్ రావు

ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి): ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, వీధి ఆహార విక్రయ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సంబధిత అధికారులను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఫుడ్ సేఫ్టీపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఆహార పదార్థాల తయారీ జరిగే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాల తయారీలో పనిచేసే సిబ్బందికి ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

హాస్టళ్లలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నీటిని క్రమం తప్పకుండా పరీక్షించి, అవి భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు



తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వీధి ఆహార విక్రయ కేంద్రాలను ప్రతి వారం కనీసం 10 నుండి 15 వరకు తనిఖీ చేసి, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జీ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం సంపత్ రావు, ఫుడ్ సేఫ్టీ అధికారి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## అత్యాచార కేసు నిందితుడికి జైలు శిక్ష : ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్

ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ తెలిపారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 సంవత్సరంలో నమోదైన క్రైం నెం.04/2023, భారతీయ శిక్ష స్మృతి , పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద నమోదైన కేసులో విచారణ పూర్తి చేసి ములుగు ప్రత్యేక పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగిందన్నారు. నిందితుడు కొరగట్ల సత్యనారాయణ (45), ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రానికి చెందిన వ్యక్తి. బాధితురాలిపై జరిగిన లైంగిక దాడి కేసును విచారించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్య చంద్ర కళ నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.



ఈ కేసు దర్యాప్తులో మొదటి దర్యాప్తు అధికారి, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అప్పటి ఎస్ఐ ఎం. సురేష్, తదుపరి దర్యాప్తు అధికారులు సీఐలు కె. శివప్రసాద్, ఎం. రాజులు కీలక పాత్ర పోషించారు.

కోర్టులో కేసు సమర్థవంతంగా నడిపించడంలో కోర్టు మానిటరింగ్ అధికారి డి ఎస్ పి కిషోర్ , కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ ఐ నాగరాజు , సీడీఓ సిబ్బంది కానిస్టేబుల్ కె. మౌనిక, పీసీ జె. మంగీలాల్ విశేష కృషి చేశారని జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ కేసు దర్యాప్తు అధికారులు, కోర్టు మానిటరింగ్ అధికారి, కోర్టు లైజనింగ్ అధికారి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు విజయవంతమైన తీర్పుకు సహకరించిన పోలీసు సిబ్బందిని అభినందించారు.

మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పట్ల ములుగు జిల్లా పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

## సీపీఐ భూ పోరాట కేంద్ర నికి మొహరించిన రెవెన్యూ మున్సిపల్ పోలీస్ అధికారులు సిబ్బంది

### -సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాట పేదల ఆందోళన
### -సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి ):

మహబూబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక అనంతరం మోడల్ స్కూల్ వద్ద 163 సర్వేనెంబర్ లో సిపిఐ ఆధ్వర్యంలో నిరుపేదలు చేస్తున్న భూ పోరాట కేంద్రం వద్ద నేడు పెద్ద ఎత్తున అన్నారు. ముఖ్యంగా సిపిఐ మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద గుడిసె వాసులకు అండగా నిలవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది సిపిఐ ఆధ్వర్యంలో భూపోరాటం నిర్వహించి గుడిసెలు వేసుకొని ఉంటున్నారని వారికి



రెవెన్యూ మున్సిపాలిటీ మరియు పోలీస్ అధికారులు సిబ్బంది మోహరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలు ఆందోళన చేశారు అధికారులు మా పేదల గుడిసెల జోలికి రావొద్దు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ పేదలు వేసిన గుడిసెలు కూల్చదని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వందలాదిమంది ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారని గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తానని మోసం చేసిందని కిరాయిలు కట్టలేక సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో భూ పోరాటం చేసుకొని గుడిసెలు వేసుకున్న మాకు అన్యాయం చేయొద్దని అన్నారు. అక్కడికి వచ్చిన రెవెన్యూ మున్సిపల్ పోలీస్ అధికారులను అభ్యర్థించారు ముఖ్యంగా జిల్లా కేంద్రంలో వందలాది ఎకరాలు భూ బకాసురులు రియల్ ఎస్టేట్ దారులు ఆక్రమించుకుంటున్న అధికారులు పట్టించుకోవడంలేదని అవి వారికి కనపడతలేవా అని పేదలు వేసుకున్న గుడిసెలు మాత్రమే అధికారులకు కనబడుతున్నాయని విజయసారథి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడిసెలు వేసుకున్న వారందరికీ ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఇల్లు లేని నిరుపేదలు ఇంటి అద్దెలు కట్టలేక సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటం ద్వారా గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే ఎంపీ అండగా ఉండి పట్టాలు ఇవ్వాలని అదేవిధంగా ఇంటి స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, 18 వ వార్డు కౌన్సిలర్ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, పట్టణ సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న,, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మామిళ్ల సాంబలక్ష్మి, మండల కార్యదర్శి తండ సందీప్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెలుగు శ్రావణ్, మేక వీరన్న,ఎండి ఫాతిమా, భానోత్ లింగ్య నాయక్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, కూరాకుల పాల్, మరియు గుడిసె వాసులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుడిని స్వదేశానికి తీసుకురావాలి.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22(భారత శక్తి): నిర్మల్ జిల్లా తల్వేద గ్రామానికి చెందిన గడ్చాంద సాయన్న దుబాయ్‌లో తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో అతడిని వెంటనే స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు అధికారులను కోరారు.




సమాచారం ప్రకారం, సాయన్న ఏడాదిన్నర క్రితం ఉపాధి కోసం యూఏఈలోని దుబాయ్‌కు వెళ్లి, ఇంజనీరింగ్ కన్స్ట్రక్షన్ అండ్ రికాన్స్ట్రక్షన్ ఎల్ఎల్‌సీ సంస్థలో నిర్మాణ రంగ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం అతడు సోనాపూర్ కార్మికుల శిబిరంలో నివసిస్తున్నాడు. ఇటీవల సాయన్న ఆకస్మికంగా పక్షవాతానికి గురై, తీవ్ర మానసిక ఒత్తిడి మరియు ఆందోళనకు లోనయ్యాడని తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో అతని భార్య కమల, కుమారుడు అజయ్ కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించి వెంటనే భారతదేశానికి పంపించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, సంస్థ యాజమాన్యం మరియు సంబంధిత ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరించాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను కలిసి సాయన్న పరిస్థితిని వివరించి సహాయం కోరారు. అనంతరం కుమారుడు అజయ్, గ్రామస్థులు అనిల్, రఘుతో కలిసి ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ రాష్ట్ర సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లను కలిసి సమస్యను వివరించారు. ఈ విషయంపై స్పందించిన స్వదేశ్ పరికిపండ్ల, ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ (ఢిల్లీ) కార్యాలయానికి, అలాగే రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (+ూణ)కు ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు పంపినట్లు తెలిపారు. సాయన్నను వీలైనంత త్వరగా యూఏఈ నుంచి భారతదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సాయన్న ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని స్వదేశానికి రప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న భోంస్లే నారాయణరావు పాటిల్



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి )ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణరావు పాటిల్ సోమవారం భైంసా మండలంలోని చుచుంద్ గ్రామం లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద నూతనంగా నిర్మించిన మూడు ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అనంతరం నూతన గృహాలను పరిశీలించిన భోంస్లే నారాయణరావు పాటిల్, గృహ యజమానులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్, రామచంద్ర రెడ్డి తదితరులు, గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి. సోఫీనగర్ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 ( భారత శక్తి )విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి. వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం సోఫీనగర్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన హాస్టల్ గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వసతుల విషయంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ముచ్చటించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ రుచికరమైన, పౌష్టికాహారం అందుతున్నదా లేదా అని విద్యార్థులను అడిగి నిర్ధారించుకున్నారు. చదువులో ఏవైనా సందేహాలు ఉన్నా, సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపాల్ డానియల్, ఎం. ఈ. ఓ పద్మ, ఉపాధ్యాయులు కల్పన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి -- రైతులు ఆందోళన చెందవద్దు : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 22: జిల్లాలో రైతులకు యూరియా ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతోందన్నారు. దీనివల్ల ఎరువుల సమాన పంపిణీతో పాటు అక్రమ నిల్వలు, మళ్లింపులను అరికట్టడం సాధ్యమవుతోందని పేర్కొన్నారు. గత వానాకాలంతో పోలిస్తే ప్రస్తుతం వరి నాట్లు నమోదైన విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ రైతులు ముందస్తుగా యూరియాను కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. కామారెడ్డి జిల్లాలో గత ఏడాది ఇదే సమయానికి 5,571 ఎకరాల్లో వరి నాట్లు నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 250 ఎకరాల్లో మాత్రమే నాట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ గత ఏడాది ఇదే తేదీ నాటికి 2.37 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేయగా, ఈ ఏడాది 2.64 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేశారని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 0.65 లక్షల యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అదనంగా అవసరమైన మేరకు నిల్వలను నిరంతరం సమకూరుస్తున్నామని తెలిపారు.




అలాగే జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరి నర్సరీలు పెంచబడిన నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల బస్తాలకు పైగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ తగిన నిల్వలను అందుబాటులో ఉంచుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికాకుండా అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి - - మరొకరికి తీవ్ర గాయాలు.

రేగొండ, జూన్ 22 (భారత శక్తి ):

గోరి కొత్త మండలం పరిధిలోని జగ్గయ్యపేట శివారులో సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే, ఇద్దరు వ్యక్తులు గోరి కొత్తపల్లి నుండి మోటార్ సైకిల్‌పై రేగొండ వైపు వెళ్తుండగా జగ్గయ్యపేట శివారులోని ఒక మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది.



ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన రాహుల్ కుమార్, వయస్సు( 21) యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మృతుడు మరియు గాయపడిన వ్యక్తి బీహార్ రాష్ట్రానికి చెందిన వారిగా ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో “ఈగల్ ఫోర్స్ తెలంగాణ” పై విద్యార్థులకు అవగాహన

రేగొండ, జూన్ 22 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం గోరికొత్తపల్లి ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.




తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈగల్ ఫోర్స్ తెలంగాణ కార్యక్రమం లక్ష్యాలు, ఉద్దేశాలను విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువత ఆరోగ్యం, భవిష్యత్తుపై పడే ప్రభావం గురించి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల సేవనం చట్టరీత్యా నేరమని, వాటి వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ, సామాజిక సమస్యలు తలెత్తుతాయని వివరించారు. గంజాయి సేవించడం, మత్తు పదార్థాలను కలిగి ఉండటం, సరఫరా చేయడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, డ్రగ్స్ లేదా గంజాయి సంబంధిత సమాచారం ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబర్ 1908 మరియు 8712671111 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కుమారస్వామి, కృష్ణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం.. మనందరి సంకల్పం

## ---- మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి
## ---- హానికరమైన విషయాలకు ధైర్యంగా “నో” చెప్పండి : డీసీపీ ఎ. భాస్కర్

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 22( భారత శక్తి ):అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలలో భాగంగా సోమవారం రోజున శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కేరళ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు రూపొందించిన చిత్రాలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం,పోలీస్ శాఖ విస్తృత చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అరెస్టులు చేస్తున్నప్పటికీ, కొంతమంది యువత తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన చిత్రాల ద్వారా డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై కలిగే ప్రతికూల ప్రభావాలను చక్కగా వివరించారని అభినందించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతిని,కుటుంబ సభ్యులతో పాటు సమాజానికీ ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. సాధారణంగా చిన్న ఆసక్తితో సిగరెట్ లేదా ఇతర మత్తు పదార్థాలను ప్రయత్నించడం ప్రారంభమై,క్రమంగా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వ్యసనాల కారణంగా కొందరు దొంగతనాలు వంటి నేరాలకు కూడా పాల్పడే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. అందువల్ల విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన విలువలను కూడా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా తమకు నచ్చని లేదా హానికరమైన విషయాలకు ధైర్యంగా “నో” చెప్పడం నేర్చుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే “నో” చెప్పే అలవాటు పెంపొందితే భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు. విద్యార్థులు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే డయల్-100కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. మంచి పౌరులుగా, బాధ్యతాయుతమైన విద్యార్థులుగా ఎదిగి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని కూడా అప్రమత్తం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్,ఎస్ఐ సంతోష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 125 దరఖాస్తులు స్వీకరణ

## పెండింగ్ దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి
## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి : ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 22 : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు.



జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మొత్తం 125 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పింఛన్లు, రెవెన్యూ తదితర అంశాలకు సంబంధించిన వినతులు ప్రజావాణిలో అందాయని, దూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రాకుండా ఆయా డివిజన్ పరిధిలో తమ అర్జీలను సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎస్ వి గిరి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జడ్ పి సీఈఓ చందర్, డిఆర్ఓ పాండు జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి.

## -గురుకుల పాఠశాల, ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 22 (భారతశక్తి): బూర్గంపాడు మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తెలంగాణ అల్పసంఖ్యాక గురుకుల పాఠశాలతో పాటు మొరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ లక్ష్మి గణపతి ఫెర్టిలైజర్ దుకాణాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత, రైతులకు ఎరువుల లభ్యత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదట తెలంగాణ అల్పసంఖ్యాక గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాలలోని కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, తరగతి గదులు, వసతి గృహాలను పరిశీలించారు. కిచెన్ షెడ్‌లో వంటల తయారీ విధానాన్ని పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. వంటశాల, భోజనశాల పరిసరాల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మెనూ చార్ట్‌ను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారమే ఆహారం అందుతున్నదా లేదా అని ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెనూ అమలులో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు తాజా కూరగాయలను మాత్రమే వంటకు వినియోగించాలని, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ పాఠశాలలో అందుతున్న విద్య, వసతి, భోజనం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థుల చేరికలు, హాజరు శాతం, బోధనా కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మొరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ లక్ష్మి గణపతి ఫెర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు తగినంతగా అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. దుకాణంలోని పత్తి విత్తనాల ప్యాకెట్లు, వివిధ రకాల ఎరువులు, పురుగుల మందుల నిల్వలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి నిల్వలు, విక్రయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదాములో నిల్వ ఉంచిన యూరియా బస్తాలను పరిశీలించి నిల్వల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందించడంలో నిర్లక్ష్యం ఉండరాదన్నారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిల్వలు, విక్రయాల వివరాలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కలెక్టర్ వెంట బూర్గంపాడు తహశీల్దార్ కె.ఆర్.కె.వి ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య, ఎంపీడీవో జమ్మల రెడ్డి, ఎంపీవో, కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి, వ్యవసాయ శాఖ అధికారి ఏవో శంకర్, హౌసింగ్ ఏడి, జిపిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# డీటీవో వెంకన్న కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం: మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి) సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అతివేగంగా వచ్చిన బొగ్గు లారీ ఘణపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టిఓ కార్యాలయం వద్ద జరిగిన దుర్ఘటనలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న మరణించడం పట్ల రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



ఈ సంఘటనపై మంత్రి హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఫోన్ చేసి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన ఎంతో విషాదకరమని పేర్కొంటూ, మరణించిన అధికారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రహదారి భద్రతపై నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాలలో వెంకన్న చాలా చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఘటనపై తగిన విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

మరణించిన వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న లారీ ప్రమాదంలో మరణించడం పట్ల జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ సంతాపం తెలిపారు. సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రవాణాశాఖ కార్యాలయం వద్ద జరిగిన దుర్ఘటనలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న మరణించటం చాలా బాధాకరమని అన్నారు.

ప్రధాన ఆసుపత్రిలో ఉంచిన వెంకన్న పార్థివ దేహాన్ని దర్శించిన కలెక్టర్ భావోద్వేగానికి గురయ్యారు. సాధారణ బదిలీలలో భాగంగా జగిత్యాల జిల్లా నుండి ఇటీవల మన జిల్లాకు బదిలీపై వచ్చిన వెంకన్న విధుల నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అధికారిగా గుర్తింపు పొందారని తెలిపారు. అలాంటి నిబద్ధత కలిగిన అధికారిని కోల్పోవడం బాధాకరమని అన్నారు.

వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వెంకన్న మహబూబాబాద్ జిల్లా మరిపెడా బంగ్లాకు చెందిన వ్యక్తి అని, 2012లో రవాణా శాఖలో ఏఎంవిఐగా ఉద్యోగం సాధించారని తెలిపారు. ప్రమాదంలో మరణించిన వెంకన్నకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం తరఫున కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో వెంకన్న సంతాప సభ నిర్వహించి వెంకన్న చిత్రపటానికి పూల మాలలు వేసి 2 నిమిషాలు మౌనం పాటించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్ఓ వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మనిషి కర్మకాండలు స్మశానవాటికలోనే నిర్వహించాలి:సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్

జనగామ (భారత శక్తి )జూన్ 22:



తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ సంబరాలు తొమ్మిది రోజుల పాటు ఎంతో వైభవంగా సాగుతుంది.ప్రకృతిని, మహిళలను గౌరవించే ఈ అద్భుతమైన పుష్పోత్సవం మహాలయ అమావాస్య నాడు ప్రారంభమై దసరాకు రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మతో బతుకమ్మ ముగుస్తుంది .బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లోని కూడళ్ళలో,వీధుల్లో,దేవాలయాల వద్ద ఆడుకుంటారు.చివరి రోజైన సద్దుల బతుకమ్మ నాడు చెరువులు,కుంటలు,నదులు వంటి జలశయాల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. అందులో భాగంగానే దేవరుప్పుల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ అధ్యక్షతన వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగని,మన గ్రామంలో బతుకమ్మలు ఆడి నిమజ్జనం చేసే వాగు ప్రదేశంలో మనిషి కర్మకాండలు నిర్వహిస్తున్నారని,తొమ్మిది రోజుల పాటు ఆడి దైవంగా కొలిచే బతుకమ్మలను అపవిత్రం చేయొద్దని,ఇక నుండి మనిషి కర్మకాండలు స్మశానవాటికలోనే నిర్వహించాలని పాలకవర్గం తీర్మానించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్రా కోమలత,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పరుశరాములు భౌతిక దేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన తీగల దయాకర్ గౌడ్.

జనగామ (భారత శక్తి )జూన్ 22:



మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు దేవరుప్పుల మండలం,రామరాజుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు నారగోని పరుశరాములు అనారోగ్యంతో మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్లి భౌతిక దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ పరామర్శించారు. మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం,గ్రామ ఇంచార్జి కుతాటి నర్సింహాలు,మండల నాయకులు బిక్షపతి,శ్రీను,గ్రామ సర్పంచ్ బోయిని మహేందర్,ఆగేష్,మండల సోషల్ మీడియా అధ్యక్షుడు దాసగని భరత్,సోమి రెడ్డి,నర్సింహాలు,బండి నర్సింహ,నాగరాజు,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# 9వ వార్డులో ఘనంగా బడిబాట కార్యక్రమం విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించిన కౌన్సిలర్ - బండారు మంగమ్మ వెంకన్న

సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 22:పిల్లలందరూ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం జిల్లా కేంద్రం లోని 9వ వార్డులో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని,ఉచితపాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, విద్యా సామగ్రి వంటి అనేక సౌకర్యాలను అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తమ లక్ష్యాలను సాధించాలని కోరారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లడుతూ విద్య ప్రాముఖ్యతను వివరించి, పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలురాజేశ్వరి , విద్యార్థినులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 'అయోధ్యను వీడి వెళ్లొద్దు'.. ట్రస్ట్, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశాలు

న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి , జూన్ 22:



ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అయోధ్యను వీడి వెళ్లొద్దని ఆలయ సిబ్బందిని, ట్రస్ట్ నిర్వాహకులను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రస్ట్ సభ్యులు తదితరులను విచారించిన వివరాలు, ఇతర అంశాలతో కూడిన నివేదికలను దర్యాప్తు అధికారులు డిజిటల్ రూపంలో భద్రపర్చుతున్నారని, అదే సమయంలో రోజువారీగా సీఎం కార్యాలయానికి పంపుతున్నట్లు చెప్పాయి.

రామమందిర ట్రస్ట్ చేపట్టిన భూ కొనుగోళ్లు, ఆలయ నిర్మాణ సామగ్రి సేకరణ అంశాలపైనా సిట్ దృష్టి సారించినట్లు సమాచారం. అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, ఆర్థిక అవకతవకల ఆరోపణలపై యూపీ ప్రభుత్వం ఈ నెల 13న సిట్ ఏర్పాటు చేసింది. విరాళాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది వాంగ్మూలాల్లో అనేక వైరుధ్యాలు ఉన్నట్లు గుర్తించారు.

# హర్మ్యూజ్ జలసంధిని మూసివేస్తే ఊరుకోం.. డోనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక!

**60 రోజుల్లో ఒప్పందం కుదరకపోతే జలసంధి మార్గంలో భారీ టోల్ విధిస్తాం**

**పశ్చిమాసియాకు అందించిన రక్షణ సేవలకు ఆ డబ్బు వసూలు చేస్తామన్న అమెరికా అధ్యక్షుడు**

**ప్రస్తుతం హర్మూజ్ ఇరాన్ నియంత్రణలో లేదు.. రవాణా సాఫీగా సాగుతోంది: యూఎస్ సెంట్రల్ కమాండ్**

**లెక్కచెయ్యని ఇజ్రాయిల్.. లెబనాన్‌పై కొనసాగుతున్న బీకర దాడులు**

అమెరికా , జూన్ 22:

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మళ్లీ మూసివేయడంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే 60 రోజుల్లో ఇరాన్‌తో తుది ఒప్పందం గనుక కుదరకపోతే హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే నౌకలపై టోల్ విధిస్తామని ఆయన గట్టి హెచ్చరికలు జారీ చేశారు. పశ్చిమాసియా దేశాలకు ఇప్పటివరకు అమెరికా అందించిన భద్రత, రక్షణ సేవలకు ప్రతిఫలంగా ఆ టోల్ డబ్బును తీసుకోనున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. ఇటీవల కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం రాబోయే 60 రోజుల పాటు ఈ మార్గంలో ఎలాంటి టోల్-రహిత (ఉచిత) ప్రయాణం ఉండాలని ఆయన గుర్తు చేశారు.

మరోవైపు హర్మూజ్ జలసంధి ప్రస్తుతం ఇరాన్ పూర్తి నియంత్రణలో లేదని, అక్కడ అంతర్జాతీయ నౌకల రవాణా ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా కొనసాగుతోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ వెల్లడించారు. సముద్ర మార్గంలో పరిస్థితి ఇలాగే ప్రశాంతంగా ఉండేలా చూసేందుకు అమెరికా సైనిక దళాలు తగిన చర్యలు తీసుకుంటున్నాయన్నారు. కేవలం శనివారం ఒక్కరోజే సుమారు 17 మిలియన్ బ్యారెళ్లకు పైగా ముడి చమురుతో కూడిన 55 వాణిజ్య నౌకలు సురక్షితంగా జలసంధిని దాటినట్లు ఆయన కీలక వివరాలు వెల్లడించారు.

ఓ వైపు అమెరికా-ఇరాన్ ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో చర్చలు మొదలుకానుండగా మరో వైపు




ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తోంది. సరిహద్దుల వద్ద పలువురు ఇజ్రాయెల్ ప్రజలు పాలస్థీనీయులపై దాడులు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఎదుర్కోవడానికి తాము ఎదురు దాడులు చేయాల్సి వస్తోందని హెజ్‌బొల్లా ఆరోపించింది. శనివారం లెబనాన్‌లోని 100కు పైగా లక్ష్యాలపై వైమానిక దాడులు చేయడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారని అనేక పౌర నివాసాలు ధ్వంసమయ్యాయని తెలిపింది.

# లంక గడ్డపై భారత 'సూర్య' ప్రతాపం.. శ్రీలంకపై 66 పరుగుల తేడాతో భారత్-ఏ ఘనవిజయం!

**- వైభవ్ సూర్యవంశీ విశ్వరూపం.. కేవలం 11 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో సరికొత్త ప్రపంచ రికార్డు!**

**- సిక్సర్లు, ఫోర్ల వర్షంతో లంక బౌలర్లను ఉతికేసిన 15 ఏళ్ల యువ సంచలనం!**

**- సమిష్టిగా రాణించిన టీమిండియా.. ట్రై-సిరీస్‌లో భారత్ జయకేతనం!**




శ్రీలంక , జూన్ 22: శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో భారత యువ జట్టు (భారత్-ఏ) సింహస్వప్నమై గర్జించింది. పరుగుల వరద పారించిన హై-స్కోరింగ్ ఫైనల్ మ్యాచ్‌లో లంక జట్టును వారి సొంత గడ్డపైనే చిత్తు చేస్తూ 66 పరుగుల భారీ తేడాతో టీమిండియా ఘనవిజయం సాధించింది. భారత బ్యాటర్ల మెరుపు ఇన్నింగ్స్‌లు, ముఖ్యంగా 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ సృష్టించిన సునామీ లంక బౌలర్లను కోలుకోలేని దెబ్బతీసింది.

-సూర్యవంశీ 'రికార్డుల' దండయాత్ర-

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు సంచలన ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ క్రీజులోకి వచ్చిన నిమిషం నుంచే లంక బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. లంక పేసర్ మహ్మద్ షిరాజ్ వేసిన ఒకే ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టిన సూర్యవంశీ కేవలం 11 బంతుల్లోనే అర్ధశతకం (50) పూర్తి చేసుకున్నాడు. దీనితో లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే 'అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ' సాధించిన ఆటగాడిగా ఈ 15 ఏళ్ల బీహార్ కుర్రాడు ప్రపంచ రికార్డు సృష్టించాడు. మొత్తం 29 బంతులు ఎదుర్కొన్న సూర్యవంశీ10 ఫోర్లు, 8 భారీ సిక్సర్ల సాయంతో 94 పరుగులు చేసి దురదృష్టవశాత్తూ సెంచరీ మిస్ అయ్యాడు.

-పరుగుల కొండెక్కిన భారత్.. లంక లొంగుబాటు-

సూర్యవంశీ ఇచ్చిన ఊపును కెప్టెన్ తిలక్ వర్మ (67), రుతురాజ్ గైక్వాడ్ (40), ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (39)లు చక్కగా అందిపుచ్చుకున్నారు. దీనితో భారత్-ఏ జట్టు నిర్ణీత ఓవర్లలో 377 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 378 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక-ఏ జట్టును భారత బౌలర్లు తమ పదునైన బౌలింగ్‌తో కట్టడి చేశారు. లంక బ్యాటర్లు గట్టిగా పోరాడినప్పటికీ, ఒత్తిడిని అధిగమించలేక 311 పరుగులకు ఆలౌట్ అయ్యి లక్ష్యానికి 66 పరుగుల దూరంలోనే నిలిచిపోయారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 4-2-252, Subhash Nagar, Hanmakonda, Warangal – 506001, Telangana. Fax: 040-24054446 ,Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50560,Editor: Kesaram Penta Reddy